స్థాపితము 1926 రిజిష్టర్ నెం. 92

గోలకొండపత్రిక

సంపాదకుడు: ఎన్.నరోత్తమరెడ్డి, ఎం.ఏ

సంపుటి 16 సంచిక 202 * హైదరాబాదు 1—8—1963 గురువారం * 4 పేజీలు 7 నయాపైసలు

రక్షణ నిధికయి ఇప్పటికి 56 కోట్లు

దాదాపు 19 లక్షల తులాల బంగారం కూడా

న్యూఢిల్లీ, జులై 31

జాతీయ రక్షణ నిధికి నేటి వరకు కేంద్ర ఖాతాకింద 55.94కోట్లు సమకూరాయి. ఇందులో బ్రిటన్ నుండి లభించిన 23 లక్షలు, ఇతర దేశాల నుండి అందిన 48 లక్షల రూపాయలు కూడా చేర్చబడ్డాయి.

రక్షణ నిధి నిమిత్తం విరాళముగా ఇప్పటి వరకూ అందిన బంగారు ఆభరణాలు దాదాపు 189284 తులాల వరకూ ఉన్నాయి.

వ్యాపారస్తులకు మంచి తరుణము త్వరలో రానున్నది.

త్రివర్ణ ముఖచిత్రముతో శ్రీ క్రోధినామ సంవత్సర

అస్లి కోసిగి పంచాంగం

నోట్:- నకిలీ పంచాంగములనుచూసి మోసపోకండి

ఉదయశ్రీ పబ్లికేషన్స్ వరంగల్.

101834

నేపా సైన్యం ప్రాంతంలోకి చైనాసేనల ప్రవేశం



మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్మారక ప్రాచ్య పరిశోధన సంస్థవారు ప్రచురించిన రెండు తెలుగు గ్రంథాలను జులై 30వ తేదిన రాష్ట్రపతి డా॥ రాధాకృష్ణ ఆవిష్కరించినప్పటి చిత్రం

చక్కెర పరిస్థితికి వ్యాపారస్తులే కారణం: శ్రీ బలరామిరెడ్డి

ధరల పెరుగుదల పరిస్థితి ఏమంత ఆందోళన కరంకాదని వివరణ

అసెంబ్లీ సమావేశాలు వాయిదా

హైదరాబాద్, జులై 31

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు జులై 26 న ప్రారంభమై మూడుదినాల విరామంతో అతిస్వల్ప వ్యవధి సమావేశంగా నిర్వహించబడి నేడు నిరవధికంగా వాయిదావేయ బడ్డాయి. సమావేశం వాయిదా పడేముందు రెండు గంటలసేపు ఆహార ధాన్యాల ధరల పెరుగుదల పరిస్థితిపై తీవ్ర చర్చ జరిగింది. క్రిందటేడుగాని గత ఆరునెలల క్రితంగాని ఉన్న ధరలకన్న ఇప్పుడు ఆహార ధాన్యాల ధరల్లో గొప్ప పెరుగుదల ఏమీలేదని వ్యవసాయ మంత్రి శ్రీ ఎ. బలరామిరెడ్డి అన్నారు.

ఆహార ధాన్యాల ధరలను గురించిన అసెంబ్లీ చర్చకు జవాబిస్తూ శ్రీ బలరామిరెడ్డి జులై నెల మొదట్లో కొద్దిగా ధరలు పెరిగాయి గాని మూడోవారంనుండి తిరిగి అవి తగ్గుముఖం పట్టాయన్నారు. ముతక ధాన్యాల ధరలు మాత్రం రూపాయో రూపాయిన్నరో పెరిగిందనీ కందిపప్పు ధరయే 20 శాతం పెరిగిందనీ ఇతర రాష్ట్రాలతో కంటిపంట కొరతగా ఉన్నందున సంభవించిందనీ శ్రీ బలరామిరెడ్డి అన్నారు. పరిస్థితి అందోళనకరం మాత్రం కాదనీ అయినా ధరల పెరుగుదలను నిరోధించేందుకు అన్ని రంగాల వారూ-వ్యాపారులు, ప్రజలూ-ప్రభుత్వంతో సహకరించాలనీ శ్రీబలరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

చవుక ధరల దుకాణాలలో వ్యాపారంలేదట

పంజాబ్ నుండి మధ్యప్రదేశ్ నుండి ఆంధ్రప్రదేశ్‌కు గోధుమలు వస్తున్నాయనీ కాని వారికి గిరాకీ లేదనీ జొన్నల నిల్వలు కూడా రాష్ట్రానికి చేరుతున్నందున ధరలు తగ్గుతున్నాయనీ శ్రీ బలరామిరెడ్డి వివరిస్తూ చవుక ధరల దుకాణాలకు తగిన వ్యాపారంలేదనీ ప్రజలు ఆ దుకాణాలకు ఎక్కువగా రావడంలేదనీ చెల్లడించారు. ప్రజల కొనుగోలు శక్తి తగిపోయిందేమో అని ఒక కమ్యూనిస్టు సభ్యుడు సూచించగా అలా భావించాల్సిన పరిస్థితులేమీలేవని మంత్రి అన్నారు.

పంచదార వ్యవహారం

రాష్ట్రంలో చక్కెర పరిస్థితులకు సాధారణ వ్యాపార వర్గాల వారే కారణమని మంత్రి పేర్కొన్నారు. చక్కెర ఉత్పత్తిలో 10 శాతం కోతను ప్రభుత్వము ప్రకటించగానే ధరలు పెరిగాయి; ప్రభుత్వం అదనపు స్టాకుల్ని విడుదలచేస్తున్నా ధరలు తగ్గలేదు. అందువల్ల పంపిణీని క్రమబద్ధంచేయాల్సి వచ్చింది. కంట్రోళ్ళు పెట్టడం ప్రభుత్వానికి సంతోషకరంకాదు. చక్కెరపై ఇప్పుడున్న కంట్రోళ్ళను రేషనింగ్ అనరాదు. రేషనింగ్ పెట్టడము కూడా ప్రభుత్వాభిమతంకాదు. మార్కెట్‌లో కృత్రిమమైన ఈ కొరత పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని విమర్శించడం కూడా తగదు. రాష్ట్రానికి లభిస్తున్న 8 వేల టన్నుల చక్కెర కోటాను 10 శాతం పెంచాల్సిందిగా కామించిన అభ్యర్థన ప్రస్తుతం కేంద్ర పరిశీలనలో ఉంది. ఇకపోతే బెల్లంధర తగ్గడానికి అంతర్‌రాష్ట్ర బెల్లంరవాణాను నిబంధించాల్సిందిగా కేంద్రానికి సూచించబడింది. అని శ్రీ బలరామిరెడ్డి అసెంబ్లీలో విపుల పరిచారు.

ధరలపై చర్చ సందర్భంగా సభ్యులు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల పన్నుల విధానమే ధరల పెరుగుదలకు కారణమని ఆరోపించారు. శ్రీ హనిలాల గోపాలకృష్ణయ్య (స్వ) చర్చను ప్రారంభిస్తూ ధరల పెరుగుదలను అరికట్టడంపోయి ఇప్పటికీ రాష్ట్రంనుండి ధాన్యాలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయనిస్తూన్నందుకు ప్రభుత్వాన్ని విమర్శించారు. శ్రీ వి విశ్వేశ్వరరావు (కమ్యూ) గత మూడుసంవత్సరాల్లో ధాన్యంధర క్విటల్‌కు నాల్గు రూపాయలు పెరిగిందనీ కొత్తపంట వచ్చేలోగా ఇంకా పెరుగవచ్చుననీ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల విధానంవల్లనే ధరలు పెరుగుతున్నాయని శ్రీ కృష్ణ (కమ్యూ) ఆరోపించారు. రాష్ట్రమంతటా రైతులు కొనుగోలుదార్లు సహకారసంస్థలు ఏర్పాటు కావాలనీ ఆహారధాన్యాల అంతరాష్ట్ర రవాణాను ప్రభుత్వము కనిపెట్టడం దొంగరవాణాను నిరోధిస్తే ధరలు తగ్గుతాయనీ శ్రీ టి. బాలకృష్ణయ్య (కాం) సూచించారు.

పంచదార కృత్రిమకొరతకు మూలం ప్రభుత్వమేనని శ్రీ గొతులచన్న (స్వతంత్రపార్టీ) విమర్శించారు. ఉత్పత్తిలో కోతకోసి, అమెరికాకు ఎగుమతుల్ని ప్రోత్సహించడంవల్ల చక్కెర కొరత ఉన్నదనీ స్వేచ్ఛావ్యాపారానికి అనుమతిస్తే కొరత తీరుతుందనీ ఆయన అన్నారు. శ్రీ కె. సీతయ్యగుప్త (కాం) క్రిందటేటికన్న ధరలు ఎక్కువ పెరుగలేదనీ ధరల పెరుగుదల ఏదయినా ఉంటే అది అవాంతర పరిస్థితివల్లననీ వ్యాపారుల్ని దూషించ నక్కర లేదనీ వాదించారు.

మంత్రిసమాధానప్రసంగానంతరము శాసనసభ కాలనిర్ణయము లేకుండా వాయిదా పడింది.

చిత్తూరుజిల్లా రైతులకు సహాయం

చిత్తూరుజిల్లామదనపల్లె, వాయల్‌పాడు తాలూకాలందు ఈ యేడాది ఏప్రిల్-మే నెలల్లో కురిసిన వడగండ్ల వాన నల్ల వష్టపోయిన పేదరైతులకు శిస్తు రెమిషన్, ఆర్థిక సహాయమూ కూడా అందజేయబడినట్లు నేడుఅసెంబ్లీలో సమాచార మంత్రి శ్రీపి.వి. నరసింహారావు తెలిపారు. శ్రీ డి. సీతారామయ్య(కమ్యూ) ప్రభుత్వదృష్టి నాకర్షి తెచ్చిన ప్రతిపాదనకు రెవెన్యూ మంత్రికి బదులు జవాబిస్తూ శ్రీ పి. వి. నరసింహారావు చిత్తూరు జిల్లా కలెక్టర్ నివేదిక ప్రకారం తక్షణ సహాయకార్యములు గైకొనబడ్డాయన్నారు. శ్రీ జి. సి. వెంకన్న (స్వ) తెచ్చిన మరో రెండు ప్రతిపాదనలకు కూడా జవాబిస్తూ ఆయన 1958 నుండి కరువు పాలవుతున్న అనంతపూర్ జిల్లా శాంతాపూర్ ప్రాంతంలో క్రిందటేడు పరిస్థితులు మెరుగయ్యాయనీ అందువల్ల శిస్తూ బకాయిల వసూళ్ళు సందర్భంగా రైతులకు కష్టం కలుగలేదనీ ప్రస్తుతం అనంతపూరు జిల్లాలో కాటక పరిస్థితులులేవనీ తెలిపారు.

ప్రివిలేజి తీర్మానం

పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్ రివెన్యూ డివిజన్‌లో ఆఫీసరును కలువ వెళ్ళిన శాసన సభ్యులతో ఆ అధికారి శాసన సభ్యుల మర్యాదను కించపరిచే తీరున మాట్లాడినందుకు శ్రీ కంకా సత్యనారాయణ తెచ్చిన

(చివర పేజి చూడుడు)

మలేశియానిర్మాణం స్వల్పంగా వాయిదా

మనిలా శిఖరాగ్ర చర్చల ధోరణిపై వదంతి

మనిలా, జులై 31

మలేశియా నిర్మాణం విషయమై బ్రిటిష్ బోర్నియోలో రిఫరెండం నిర్వహించడానికి ఐక్యరాజ్యసమితి పూనుకొనేట్లయితే మలయా వైపుఉండగలదని నేడు మలయా ప్రధాని టంకు అబ్దుల్ రహమాన్ విలేఖరులతో చెప్పాడు.

ఐక్యరాజ్యసమితి కార్యదర్శి ఉథాంట్ రిఫరెండాన్ని కోరేట్లయితే మలేశియా నిర్మాణాన్ని వాయిదా వేయడానికి మనిలాశిఖరాగ్ర చర్చల్లో టంకు అంగీకరించినట్లు వదంతిగాఉంది. ఇంతవరకూ-ఇండోనీషియా బెదిరించినా కూడా-మలేశియా నిర్మాణం ఆగస్టు 31న జరుగాల్సిందేనని రిఫరెండం అక్కర్లేదనీ టంకు వాదిస్తూ వచ్చాడు.

మనిలా శిఖరాగ్ర చర్చల సందర్భంగా రిఫరెండం జరిపితే ఎన్నాళ్ళు వ్యవధికావాలని సమితి కార్యదర్శిని కొందరు సభ్యులుకోరారనీ ఆరు వారాలవసరమని జవాబు రాగా మలేశియా నిర్మాణం వాయిదా పడినా స్వల్పకాలమేగదా అనే అభిప్రాయానికి రావడం జరిగిందనీ అనుకుంటున్నారు.

టంకు సూచనపై ఇండోనీషియా వర్గాలు వ్యాఖ్యానించలేదు. సుకర్నో. మ పగల్ ఫిలిప్పీన్స్), టంకుల శిఖరాగ్ర చర్చలు నిన్నటినుండి సాగుతున్నాయి.

నెహ్రూ రాజీనామా చేయాలనడం మూర్ఖత

కమ్యూనిస్టు ప్రముఖుడు జడ్.ఏ. అహ్మద్ అభిప్రాయం

గ్వాలియర్, జులై 31

దేశ నాయకత్వానికి మరెవ్వరూ సమర్థులుకాని ఈ తరుణంలో ప్రధాని శ్రీ నెహ్రూను రాజీనామా ఇవ్వాలని కోరడమంత తెలివితక్కువ తనం తనం మరొకటి ఉండదని కమ్యూనిస్టు ప్రముఖుడు జడ్.ఏ. అహ్మద్ నేడు విలేఖరులతో అన్నాడు. ఈనాడు దేశ రక్షణకు జాతీయైక్యత అత్యవసరమన్నాడు.

ఆతడు చైనా విధానాన్ని నిరసించి రష్యా సహాయాన్ని కైఖరిని ప్రశంసించాడు.

అస్సాంకు అవసర సప్లయిలపై ఢిల్లీలో చర్చలు

చైనాకు భారతప్రభుత్వ ఆందోళనపత్రం

న్యూఢిల్లీ, జులై 31

భారత సరిహద్దుల పొడవునా భారీయెత్తున చైనావారు సేనల్ని సమీకరించినందుకు భారత ప్రభుత్వపు ఆందోళనను భారతప్రభుత్వం చైనాప్రభుత్వానికి తెలియబరిచింది. నిన్న ఢిల్లీలోని చైనా ఛార్జిడి అఫేర్స్‌ను విదేశాంగశాఖకు రావించి భారత ప్రభుత్వ ఆందోళనపత్రం అందజేశారు.

నేపా ప్రాంతంలో చైనాసేనలు చొచ్చుకు రాలేదని ఒక ప్రశ్నకు విదేశాంగశాఖ ప్రతినిధి నేడు జవాబిచ్చారు.

అయితే సరిహద్దు పరిస్థితిలో మార్పేమీ లేదనీ చైనాసేనల సమీకరణ సాగుతూనేఉందనీకూడా ఆయన చెప్పారు.

పెకింగులోనిసింహళ రాయబారి ఎ.బి. పెరీరా నిన్న కొలంబో చేరినప్పుడు ఒక ప్రకటనచేస్తూ భారత సరిహద్దుల్లో చైనాసేనలు సమీకరించబడుతున్నాయన్న వార్తలో ఎంతనిజముఉన్నదంటే సింహళ ప్రభుత్వం ఒక నౌకాస్థావరాన్ని చైనాకు ఇవ్వడానికి అంగీకరించినట్లు భారత పత్రికలు ఇటీవల ప్రచురించిన వార్తలో ఉన్నంతనిజం ఉన్నది అని వ్యాఖ్యానించాడు. ఈ పెరీరా ప్రకటనపై విదేశాంగ ప్రతినిధిని విలేఖరులు ప్రశ్నించగా "నిజంగా సరిహద్దుల్లో ఏమి జరుగుతున్నదోసరిహద్దులతో సంబంధాలున్నవారికి తెలుస్తుంది"అని జవాబిచ్చారు. [పెరీరా సింహళ మంత్రిగా నియమింపబడుతాడన్నవదంతికూడా ఉన్నది.]

నేడు బ్రిటిష్ హైకమీషనరు విదేశాంగశాఖ ఉపమంత్రి శ్రీ దినేశ్ సింగ్‌ను కలిసి చర్చించారు.

రక్షణ మంత్రి శ్రీ చ్యవన్ నేడు అస్సాం ముఖ్యమంత్రి శ్రీబి పి. చాలిహాతో చైనా, పాకిస్తాన్ సేనల యుద్ధ చర్యల పరిస్థితిని గురించి చర్చించారు. శ్రీ చాలిహా నేడు ప్రధాని శ్రీ నెహ్రూను కూడా కలిసి సరిహద్దుల్లోని పరిస్థితిపట్ల అస్సాంరాష్ట్రకృషిని చర్చించారు. నేడుకూడా రక్షణమంత్రి సేనా నౌకా వైమానిక శాఖాధిపతులతో చర్చలుకొనసాగించారు. ఆయన విదేశాంగశాఖ కార్యదర్శి శ్రీ దేశాయితో కూడా మాట్లాడారు.

భూటాన్ ప్రధాని జిగ్మీడోర్జీ నేడే ఢిల్లీ చేరారు. ఆయన ఈ సాయంత్రమే విదేశాంగశాఖ ఉపమంత్రి శ్రీమతి లక్ష్మీమీనన్‌తో చర్చలు సాగించారు.

శ్రీ చాలిహా వివరణ

అస్సాం ముఖ్యమంత్రి శ్రీ చాలిహా నేడు రక్షణ మంత్రి శ్రీ చ్యవన్‌తోను సర్వసేనాని జనరల్ చౌధరీతోను కూడా చర్చలు జరిపారు.

సరిహద్దుల్లో చైనా మోహరింపును ధృవపరుస్తూ ఆయన చైనా సేనలు తాము నిర్ణయించుకున్న 20 కిలోమీటర్ల నిస్సైన్య ప్రాంతంలోకి ప్రవేశించి మక్ మాహన్ రేఖ సమీపానికే నడుస్తున్నాయని విలేఖరులతో అన్నారు. కేంద్రాధికారులతో తాను అస్సాముకు అదనపు సప్లయిల విషయం చర్చించానని ఇప్పుడు సరిహద్దుల్లో సప్లయిలు చేర్చటానికి రవాణా సౌకర్యాల పరిస్థితి బాగుపడిందనీ ఆయన చెప్పారు.

బొకారో విషయం ఈ యేడాది తేలదా?

వాషింగ్టన్ వర్తమానానికై భారత ప్రభుత్వం ఎదురు తెన్నులు

న్యూఢిల్లీ, జులై 31

బొకారో ఉక్కు కర్మాగారానికి అమెరికా సహాయాన్ని గురించి ఈ యేడాది ఏమీ నిర్ణయం తేలదని అమెరికా విదేశ సహాయ వ్యవహారాల అధికారి డేవిడ్ బెల్ వాషింగ్టన్‌లో నిన్న కావించిన ఒక ప్రకటనపై భారత ప్రభుత్వ ఉక్కు పరిశ్రమలశాఖ వర్గాల వారు ఏమీ వ్యాఖ్యానించ నిరాకరించారు.

వాషింగ్టన్‌లో విదేశ వ్యవహారాల కమిటీ ప్రతినిధుల సభలో విదేశీ సహాయ బిల్లుపై నేడే ఓటింగ్ జరుగనున్నది కాగా భారత ప్రభుత్వం వాషింగ్టన్‌నుండి వర్తమానానికై వేచి ఉన్నది.

భావే సల్పిన 10 నెలల పదయాత్రకు 55 వేలు

ప్రభుత్వానికి ఖర్చు

కలకత్తా, జులై 31

క్రిందటేడు సెప్టెంబరు 21 నుండి ఈ సంవత్సరం జులై 19 వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఆచార్య వినోబా భావే జరిపిన పదయాత్రవల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రు55465 లు ఖర్చయినట్లు రాష్ట్ర శాసన సభలో పశ్చిమ బెంగాల్ ఆర్థిక మంత్రి శ్రీ శంకర్‌దాస్ బెనర్జీ చెప్పారు. కలకత్తాలో ఆచార్య భావే ప్రసంగించిన బహిరంగ సభ నిమిత్తం 15 వేలు, కలకత్తాలో ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన ఉన్నప్పుడు వినోద ఉల్లాస కార్యక్రమాలకై రు. 12 వేలు, మిగిలిన మొత్తం పదయాత్రా బృందాల గ్రేజి. మున్నగువాటి రవాణాకు ఖర్చయినదట.

స్టీఫెన్‌వార్డ్‌కు తీవ్ర అపస్మార స్థితి

లండన్, జులై 31

బ్రిటిష్ మాజీ యుద్ధమంత్రి పోర్ట్ పూమో, వారకాంత క్రిస్టిన్ కీలర్ల ప్రణయోదంతంతో బైటికి పొక్కి వారకాంతలను తార్చి డబ్బు సంపాదించి బతుకుతున్నాడన్న ఆరోపణల పై విచారణకు గురిఅవుతున్న బ్రిటిష్ డాక్టర్-రచయిత-చిత్రకారుడు అగుస్టీఫెన్‌వార్డు నేడు అపస్మార స్థితిలో ఆసుపత్రి పాలయ్యాడు. గతరాత్రి తీవ్రంగా మందులు వాడినందున ఆతడు స్మృతికోల్పోయాడని తెలుస్తున్నది. ఆతడు వారందినాలపాటు కోర్టుకు హాజరుకాలేదని ఆతని తరపు న్యాయవాదులు తెలియజేశారు. వార్డు చికిత్స పొందుతున్న చోటనే కాపలా ఉంచబడింది.

నేటి ఉదయం ఆసుపత్రికి చేర్చబడిన స్టీఫెన్ వార్డుకు ఈ సాయంత్రంవరకూ స్మృతిరాలేదట.

జీవిత పరమార్థ ప్రబోధం

కల టాగోర్ రచనలు

డా॥గోపాలరెడ్డిఅనువాదగ్రంథాన్ని ఆవిష్కరిస్తు రాష్ట్రపతి ప్రశంసలు

హైదరాబాదు, జులై 31

నేడు ప్రజల జీవనవధం పునః ప్రబుద్ధమై సాఫల్య లక్ష్యంగల నైతిక జాతీయతావైఖరి ప్రతిఫలించాలనీ అసలు మతం యొక్క లక్ష్యమిదేననీ రాష్ట్రపతి డా॥ రాధాకృష్ణ నేడు ప్రబోధించారు.

రవీంద్రభారతిలోయీసాయంత్రం ఆయన కేంద్ర సమాచారమంత్రి శ్రీ బి. గోపాలరెడ్డి వంగమాతృకనుండి తెలుగుచేసిన "రవీంద్రుని నాటికలు" అనుగ్రంథాన్నిఆవిష్కరించారు. మంచి తెలుసు కాని దాన్ని అనుసరించలేని స్థితి; చెడూ తెలుసు కాని దానినుండి దూరంగా పోజాలనిస్థితి నేటి సమాజాన్ని పీడిస్తున్న వాతావరణంలో జీవనసమైక్యతకై విశ్వమానవతను ప్రబోధించిన రవీంద్రనాథ టాగోర్ రచనల ప్రభావం ఎంతైనా ఉండగలదని రాష్ట్రపతి ఆశించారు. మేధస్సును, మనస్సును సంలీనం చేయగల సారస్వత ప్రభావం రవీంద్రునికలంలో ఉందన్నారు. విశ్వవిద్యాలయం శాంతినికేతన్‌లో రవీంద్రుని సన్నిధిలోఉండి ఆయన వ్యక్తిత్వానికి ప్రభావితుడైన డా॥ గోపాలరెడ్డి సారస్వతరంగంలో చేసినకృషినిరాష్ట్రపతి ప్రశంసించారు.

గ్రంథ ప్రచురణకర్త జనతా పబ్లికేషన్స్ (తెనాలి) యజమాని శ్రీ ఎ. రవీంద్రనాథ్ స్వాగతం చెప్పారు.

అనంతరం డా॥ జి. రాజారావు దర్శకత్వాన శ్రీ వి.కె.ఆర్. జయంతి సమర్పించిన "జైభవాని" ప్రబోధ నాటకం ప్రదర్శించబడింది, శివాజీ కాలంలో గూఢచారుల సమర్థవంత పాత్రను, దేశభక్తితో ఆత్మత్యాగానికి ఒడిగట్టిన వీరులను చిత్రించే ఈ నాటకం మామావరేర్కర్ మరాటీ మాతృకనుండి శ్రీ ఎన్. జగన్నాథ్‌చే తెనిగించబడింది. నాటకం రచన, పాత్రధారుల నటనా కౌశలం ప్రేక్షకులను ఎంతగానోఆకర్షించాఇరాష్ట్రపతి రెండు గంటలసేపు ఈ నాటకాన్ని తిలకించారు. మంత్రులు, ఎం.ఎల్.ఎలు అధికారులు, నటుడు శ్రీ ఎ. నాగేశ్వరరావు ఈ నాటక ప్రదర్శనకు హాజరైనారు.

సొంతప్రతిపాదనపై స్వీయవ్యతిరేకత

హైదరాబాదు, జులై 31

శాసన సభలో వచ్చే ప్రతిపాదనలపై ప్రతి సభ్యుడూ తన ఇష్టం వచ్చినట్లు ఓటు చేయవచ్చునుగాని, తాను ప్రతిపాదించిన అంశంపైతానే వ్యతిరేకముగా ఓటు చేయడం మాచిది, కాదేమోనని నేడు రాష్ట్ర శాసన సభలో స్పీకర్ శ్రీ బి. వి. సుబ్బారెడ్డి అన్నారు.

శ్రీ కె. సీతయ్య గుప్త (కాం) అమ్మకం పన్ను సవరణ బిల్లులో ఒక క్లాజుకు తెచ్చినసవరణ ప్రతిపాదనను నోటీ ఓటుకు ప్రకటించిన తర్వాత ఉపసంహరించుకోదలచగా కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ కె. ఎల్. నరసింహారావు అభ్యంతరం చెప్పారు. దానిపై ఓటింగు కొనసాగింది. సీతయ్యగుప్త తన సవరణ ప్రతిపాదనకే వ్యతిరేకంగా ఓటు చేశారు.

పోర్చుగల్‌కు ఆయుధాలుపంపరాదని భద్రతామండలి తీర్మానం

న్యూయార్క్, జులై 31

ఆఫ్రికాలోని పోర్చుగీసు కాలనీల స్వాతంత్ర్యానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాల్సిందిగా పోర్చుగల్‌నుకోరుతూ ఆ కాలనీల్లోని స్వాతంత్ర్యోద్యమాలను అణచ వీలయ్యేట్లుగా ఏ దేశమూ పోర్చుగల్‌కు ఆయుధాలు పంపరాదని నేడుభద్రతా మండలి తీర్మానించింది.

12 ఆఫ్రికా రాజ్యాలు తెచ్చిన ఈ తీర్మానానికి వెనుజులా సవరించి ప్రతిపాదించిన ఈ రాజీ తీర్మానంపై నాటో కూటమి రాజ్యాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఓటుచేయలేదు; మరో సభ్య రాజ్యం నార్వేఅనుకూలముగా ఓటుచేసింది.

మొదట తీర్మానాన్ని ఆదేశంగా విడుదల చేయాలన్న ప్రతిపాదన సవరించబడి సలహా రూపంగా తయారు చేయబడింది. ఈ సవరణను ఆఫ్రికా రాజ్యాలు ఇష్టం లేకపోయినా ఒప్పుకున్నట్లు ఘానా ప్రతినిధి ప్రకటించాడు.

న్యూఢిల్లీ, జులై 31

ప్రపంచ మహాసమాఖ్యకు భారత ప్రతినిధివర్గం నాయకులుగా హాజరై మాస్కోనుండి తిరిగివచ్చిన అరుణా అసఫలీ ఈ ఉదయం ప్రధాని శ్రీ నెహ్రూనుకలిసి మహాసభ విశేషాలను, రష్యా తదితర దూర్పు ఐరోపా రాజ్యాల్లో తన పర్యటనానుభవాలను వివరించారు;

నేపాల్‌లో భారతనాణెము వాడకం నివేధం

ఇరువదికేంద్రాలు,అన్ని నగర పంచాయత్‌లలో

కాట్మాండు, జులై 31

నేపాల్ స్టేట్‌బ్యాంకు అనుమతి ఉంటేనేతప్ప నేపాల్‌లోని ఇరువది వ్యాపార ప్రదేశములు అన్నినగర పంచాయతులందు భారత దేశపు రూపాయి నాణెములు సామాన్యుల కొనుగోలుకు అమ్మకానికి వర్తక వ్యాపారాలకు వాడబడవు. నేపాల్ కరెన్సీవాడకాన్ని పెంచేందుకై నేపాల్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్నిబట్టి ఇట్టి నిర్ణయం తీసుకొనబడిందని నేపాల్ ఆర్థిక మంత్రాంగ ప్రకటన తెలుపుతున్నది. భారతకరెన్సీ వాడకంనిషేధించబడిన కేంద్రాలుఇవి: బిరాట్‌నగర్, ఛత్రపూర్, బీర్‌గంజ్, జానక్‌పూర్, నేపాల్‌గంజ్, పోఖ్రా, తాసేన్, పాల్పా అన్ని నగరపంచాయత్‌లు హనుమాన్‌నగర్ పంచాయత్, మలంగ్వా బాజార్, భైరవ బజార్, పరాసిబజార్, ప్లాక్లిహావా బజార్, నాన్‌గరి బజార్, కైలాస్ బజార్, కృష్ణనగర్‌బజార్, శివరాజ్ బజార్, భారన్‌బజార్, ఈ వ్యాపార కేంద్రాలన్నీ భారతనేపాల్ సరిహద్దు అందున్నాయి.

భారతదేశానికి కెనడా సహాయం

అవసరసమయంలో తప్పక ఉంటుందని రాజకీయవర్గాలభావన

అట్టావా, జులై 31

కెనడా భారతదేశానికి సైనిక విమానసహాయాన్ని ఇవ్వగలుగదని అనినంత మాత్రాన భారతదేశాన్ని అవసర సమయంలో కెనడా ఆదుకొనదని అర్థం కాదని ఇక్కడి రాజకీయ పరిశీలకులు తెలుపుతున్నారు.

కెనడాకు తగినన్ని విమానాలు లేవని కరాచి ప్రభుత్వం అవసరమైన పెకింగ్ సహాయాన్ని అర్థించుటలో వెనుకాడదనిఈవర్గాలుసూచిస్తున్నాయి

PAY-DAY IS SAVINGS DAY

Purchase

FASHIONS CONCESSION COUPONS

DISCOUNT 10%-15%-20%

FROM ANY BRANCH OF

FASHIONS ELECTRIC DRY-CLEANERS

శ్రీ జి. ఎం. పెంటయ్య

ఫుట్‌బాల్ శిక్షకుల కమిటీ కన్వీనర్‌గా నియామకం

హైదరాబాద్, జులై 31

నిన్న ఇక్కడ జరిగిన రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ వి. శివకుమార్‌లాల్, శ్రీ జి. యం. పెంటయ్యను ఫుట్‌బాల్ శిక్షకుల కమిటీ కన్వీనర్‌గా నియమించారు.

ఏడాదిలోగా చైనా అణు బాంబు ప్రేల్చవచ్చు

డీన్‌రస్క్ వెల్లడి

వాషింగ్‌టన్, జులై 31

వచ్చే పన్నెండు నెలల్లోపున పీపుల్స్ చైనా తన ప్రథమ అణు బాంబును పేల్చినప్పటికీ, తాను ఆశ్చర్య పడనని అమెరికా విదేశాంగ కార్యదర్శి డీన్‌రస్క్ ఇక్కడ చెప్పారు.

మాస్కో ఒప్పందం అమెరికా విదేశాంగ విధానంలో ఒక ప్రధానమైన అంశమని ఆయన విలేఖరులకు చెప్పారు.

యు. ఎస్. విమానానికి ప్రమాదం

గాండర్, జులై 31

యునైటెడ్ స్టేట్సు సౌకర్యాలకు చెందిన పెద్ద విమాన మొకటి విమానాశ్రయపు రన్‌వేమీద దిగబోయి గురి తప్పడం వల్ల నేలకు గుద్దుకొని మంటలు రేగి పగిలి పోయింది.

ఈ విమానంలో యెంతమంది ఉన్నారో వారిలో ఎందరు ప్రమాదం నుండి బయటపడ్డారో ఇంకా తెలియరాలేదు.

కుటుంబ నియంత్రణ కార్యక్రమ ప్రగతి

న్యూఢిల్లీ, జులై 31

కుటుంబ నియంత్రణ కార్యక్రమం ప్రగతిని పరిశీలించటానికై కేంద్ర కుటుంబ నియంత్రణమండలి పరిశీలన సంఘాన్నొకదాన్ని ఏర్పాటు చేసింది.

ఈ సంఘము తాను నిర్వహించవలసిన కార్యకలాపాలనుగూర్చి ఒక కార్యక్రమాన్ని నిర్ణయించుకోటానికి న్యూఢిల్లీలో సమావేశమైంది.

తృతీయ ప్రణాళికా కాలములో ఈ కుటుంబ నియంత్రణ కార్యక్రమం విషయములో ఇంతవరకు సాధించిన ఫలితాలను ఇది సమీక్షిస్తుంది. ఇంతవరకు సమకూడిన సమాచారం, ప్రస్తుత రీతుల దృష్ట్యా తృతీయ ప్రణాళిక అంతానికి ఏ ఫలితాలను సాధించ వీలయ్యేదీ ఇది నిర్ణయిస్తుంది.

అంతేగాక రానున్న 15 సంవత్సరాలలోను పొందవీలయ్యే ఫలితాలను గురించికూడా ఈ సంఘము, చతుర్థ ప్రణాళిక కొరకు సూచనలు చేస్తుంది.

ఈసమావేశాన్ని ప్రారంభిస్తూ ఆరోగ్యశాఖమంత్రి డా॥ సుశీలానయ్యర్ భారతదేశములో ఈనాడు జనాభా సమస్య ఎంత తీవ్రముగా ఉందీ వివరించారు. కుటుంబ నియంత్రణ విషయమై కిందటి సంవత్సరము వార్షిక నివేదికలో చేయబడిన పరిశీలనలను ఈ సంఘము జాగ్రత్తగా గ్రహించాలని ఆమె సూచించారు.

ఈ సంఘము రెండు లక్ష్యాలను దృష్టియందుంచుకొని పనిచేయాలనీ, ప్రజలు ఈకుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ఎంతవరకు సమ్మతించాలో నిర్ణయించటము, దీన్ని ఒప్పుకున్న ప్రజలకు ఎంతవరకు సహాయము చేయగలిగారో తెలుసుకోటము, ఇవే ఆ లక్ష్యాలని ఆమె అన్నారు. దేశములో వేర్వేరుభాగాలలో ఈకుటుంబ నియంత్రణకై అనుసరించే పద్ధతులను అభివృద్ధి పరచటములో ఈ సంఘము సహాయము చేయగలదనికూడా ఆమె ఆశించారు.

ఈసమితి సంఘ అధ్యక్షుడు, ఆరోగ్యశాఖ ఉపమంత్రి డా॥ డి. ఎస్. రాజు ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిలో ఈ కుటుంబ నియంత్రణ కార్యక్రమం కీలకస్థానాన్నాక్రమిస్తుందనిఅన్నారు.

గరివిడిఫ్యాక్టరీకార్మికుల పైబాష్పవాయుప్రయోగం

ఆరు గురికి గాయాలు

హైదరాబాద్, జులై 31

విశాఖపట్నం జిల్లా గరివిడిలోని ఫ్లోరోఫిల్లాయ్ కార్పొరేషన్‌కు చెందిన 7 వందల కార్మికులు గత 14 రోజులుగా సమ్మెచేస్తున్నారని, సమ్మెదార్లను చెదరకొట్టుటకయి పోలీసులు నిన్న బాష్పవాయు ప్రయోగము చేయగా 6 గురు కార్మికులు గాయపడ్డారని నిన్న ఇక్కడి పోలీసు కేంద్ర కార్యాలయానికి వర్తమానమందింది. ఈ సమ్మెదార్లు నిన్న ఉదయం ఫ్యాక్టరీ గేటువద్ద గుమిగూడి ఫ్యాక్టరీ వాహనాల రాకపోకలకు ఆటంకం కల్పించారని వర్తమానంలో తెలుపబడినది. వారు ఇంకా రెండు టి దుకాణాలను అగ్ని ప్రమాదానికి గురిచేసినట్లున్నూ ఆ సమయంలో పోలీసులు సమ్మెదార్లపై లాఠీచార్జీ జరిపిన అనంతరము గుంపును చెదరకొట్టుటకయి బాష్పవాయు ప్రయోగం చేశారు. అనంతరం సమ్మెదార్లు ఆ చోటునుంచి వెళ్ళిపోయినారు.

శోభకృత్ సం॥ శ్రావణ శు॥ ఏకాదశి
వ 2-2 జ్యేష్ఠరా 7-49
తె వ 4-22 మొ:
(శాలివాహనశకము: 10-5-1885)
1-8-1963 గురువారము

"పరము నతురంబుఁ
గానంగఁ బోలు
పేదార్థ చింతనమున
నమ్మిథునము నందుఁ
బూర్వ మురివి యప
రంబు సేపట్టి నిలువ
వలయు నధిక నిష్ఠగలిగి".

— భారతము (శాంతి)

గోలకొండపత్రిక
ఫోన్ నెం. 35280
1 ఆగస్టు 1963
గురువారము

నగరంలో నాటక ప్రదర్శనాలు

—(o)—

హైదరాబాదు నగరములో గడచిన పదిరోజులు హిందీ నాటక ప్రదర్శనాలు జరిగినవి; కేంద్ర సమాచార, ప్రసార శాఖ సంగీత నాటక విభాగము ఆధ్వర్యమున హైదరాబాదులో అయిదు హిందీ నాటకాలు పదిరోజులపాటు ప్రదర్శితమైనవి. కేంద్ర సమాచార, ప్రసారశాఖ సంగీత నాటక విభాగమువారు యీ హిందీ నాటకాలను దేశములోని అన్ని రాష్ట్రాలకువెళ్ళి ప్రదర్శించుచున్నారు. మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరమునందు కేంద్ర సమాచార, ప్రసారశాఖ సంగీత నాటక విభాగపు హిందీ నాటకాల ప్రదర్శనాన్ని యేర్పాటు చేసి, చక్కగా నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ పంచవర్ష ప్రణాళికా ప్రచార శాఖవారిని ప్రత్యేకముగా అభినందించవలసియున్నది; గడచిన పదిరోజులయందు ప్రదర్శితమైన అయిదు నాటకాలను చూచినవారు మా యీ ఇభిప్రాయముతో తప్పక యేకీభవించగలరని చెప్పవచ్చును.

కేంద్ర సమాచార, ప్రసార శాఖ యాజమాన్యములోనున్న సంగీత, నాటక విభాగము ప్రత్యేకముగా ప్రచార కార్యక్రమాల కొరకు ఉద్దేశించబడినది; పంచవర్ష ప్రణాళిక ప్రచారముయీ ప్రచార కార్యక్రమాలలో ప్రధానమైనది. అయితే ఒక్క పంచవర్ష ప్రణాళిక ప్రచార కార్యక్రమానికి మాత్రమే పరిమితము కాకుండా దేశము నేడు యెదుర్కొంటున్న అనేకమైన యితర ప్రధాన సమస్యలను గూడ తమ నాటకాలకు యితివృత్తాలుగా కథా వస్తువులుగా సంగీత నాటక విభాగము స్వీకరించినది. నిజానికి జాతీయ సమైక్యత ప్రణాళిక కార్యక్రమాల విజయానికి ప్రాతిపదికవంటిది. జాతీయ సమైక్యత పటిష్టముగా నెలకొని ప్రణాళికా కార్యక్రమాల ద్వారా ఆర్థిక అభ్యున్నతి సక్రమముగా జరిగినప్పుడే మన దేశము బయటి దేశాలనుండి జరిగే దురాక్రమణలను, దాడులను సమర్థవంతముగా యెదుర్కొనగలదు. అందుచేత జాతీయ సమైక్యత, దేశ రక్షణ, క్రమించి పనిచేయడము ఒకదానితో మరొకటి అంతర్గత సంబంధము కలిగి మన జాతీయ జీవనములో చాల ప్రముఖమైన పాత్ర వహించుచున్నవి; వీటిని గురించి ప్రజలకు తెలియచెప్పడము, ప్రచారము జరుపడము అనుకొన్నంత సామాన్యమైన విషయముకాదు. ప్రచారము కొరకు ఉద్దేశించినయే ప్రక్రియనైనను కళా ఖండముగ తీర్చి దిద్దడము మిక్కిలి క్లిష్టమైన పని; ప్రచారాత్మకమైన నాటకాలుగాని తదితర సంగీత, సాహిత్య, కార్యక్రమాలుగాని, ప్రజల దృష్టిలో కళా ఖండాలుగా స్థానము సంపాదించుట చాల కష్టమైన పని. ఈ క్లిష్టమైన కార్యాన్ని, కష్టమైన పనిని సంగీత, నాటక విభాగము ప్రతిభావంతముగా, ప్రశంసనీయముగా నిర్వహించినారనిచెప్పవలెను. సంగీత, నాటక విభాగము ప్రదర్శించిన ఉత్తేజకరమైన చరిత్రాత్మక నాటకము "కోహినూర్-కాలుపేరా"ను తిలకించే ప్రేక్షకులకు అందులో దేశ రక్షణ పిలుపు పరోక్షముగా మాత్రమే వినిపించగలదు; అదేవిధముగా "ధర్మశాల" నాటకములో "జాతీయసమైక్యత", "ఆరామ్" నాటకములో "ఆరామ్ హరామ్ హై" అన్న శ్రీ జవహర్‌లాల్ సూక్తి ప్రబోధించబడినవి. రంగస్థల నిర్మాణము, ఆహార్యము, నటన, పాత్రీకరణము, నాటక రచన, దర్శకత్వము ప్రతి వొకటి పేరుపేరున ప్రశంసించదగినంత చక్కగా, ప్రతిభావంతముగా రాణించినవి. ప్రచారము కొరకు ఉద్దేశించబడినవను విషయాన్ని ప్రజలు పసికట్టకుండా యీ నాటకాలు ప్రజల హృదయాల మీద ముద్రవేసి తమ ప్రయోజనాన్ని సాధించినవి.

ఈ సందర్భమున సంగీత, నాటక విభాగము వారికిని, ప్రణాళికా ప్రచారశాఖ వారికిని కొన్ని సూచనలు చేయవలసియున్నది; నాటకాల ప్రదర్శన కాలమును కొంతవరకు తగ్గించగలిగినచో మరింత ఆకర్షవంతముగా తయారు కాగలవని మా అభిప్రాయము. సంగీత నాటక విభాగమువారు హైదరాబాదుకు తగిన సమయములో రాలేదని మా అభిప్రాయము; వర్షాకాలము సభలు, సమావేశాలకు సాంస్కృతిక ప్రదర్శనాలకు అంత అనువైన సమయము కాదు. అన్నిటికంటె ముఖ్యమైనది ప్రదర్శనాలకు ప్రదేశము; ఆరుబయలు రంగస్థలాలయందు ప్రదర్శనాలను ఏర్పాటు చేసినచో యెట్టి నిర్బంధాలు లేకుండా ప్రజలందరికి ప్రదర్శనాలను తిలకించెడి అవకాశము లభ్యము కాగలదు. మొదటి కొన్ని ప్రదర్శనాలకు ఉచిత ప్రవేశము కలిగించి తరువాత ప్రదర్శనాలకు టికెట్లు అమ్ముట సరియైన పద్ధతికాదు.

కేంద్ర సమాచార, ప్రసార శాఖ సంగీత నాటక విభాగము వారు, పంచవర్ష ప్రణాళికలో ప్రచార శాఖవారు మా సూచనలను పరిశీలించగలరని విశ్వసించుచు నాటక బృందానికి నాటక నిర్వాహకులకు అభినందనలను తెలుపుచున్నాము.

జోగిపేట గుమాస్తా సంఘ సమావేశం

(గోలకొండ పత్రిక విలేఖరి)

జోగిపేట, జులై 31

జోగిపేట గుమాస్తా యూనియన్ ఈనెల 20 వ తేదీన సంఘ కార్యాలయములో సమావేశమై గుమాస్తాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చ జరిపి ఈ కింది తీర్మానములు గైకొన్నది. ఈ సమావేశమునకు సంఘ అధ్యక్షులు శ్రీ అగ్గె ఆశయ్య అధ్యక్షత వహించారు. తీర్మానములో జోగిపేటను కార్మిక చట్టము పరిధిలోకి చేర్చనప్పటికీ, రిజిష్టర్డు కార్మిక సంఘాలు మిల్లులు మొదలగు తదితర సంస్థలు పున్నప్పటికీ, చట్ట ప్రకారము ఉద్యోగవిధులు, ఫ్యాక్టరీ నియమాలు సక్రమంగా అమలు జరుగుటలేదనీ, స్థానిక వ్యవసాయ మార్కెటు రికార్డులవల్లజుబులవగుచున్నదని ఇట్టివిధాన నివారణకై జోగిపేటలో లేబరు ఇన్స్పెక్టరు కార్యాలయము నెలకొల్పవలెనని మరియు సంఘము ఆర్థిక పరిస్థితులు మెరుగు పరుచుటకు సంఘ సభ్యులు తమ తమ చందాలు చెల్లించవలెనని ప్రతిమాసమునకు సమావేశం జరుగవలెనని తీర్మానించిరి.

రాష్ట్రంలో 600 ఎకరాలలో ద్రాక్షపంట ఉత్పత్తి

1963-64లో చిన్నతరహా ఉత్పత్తిదారులకే సబ్సిడీ పరిమితంచేయబడిందని బలరామిరెడ్డివెల్లడి

హైదరాబాద్, జులై 31

రాష్ట్రములో దాదాపు 600 ఎకరాలలో ద్రాక్షపంట ఉత్పత్తి అవుతున్నదనీ, వాటిలో 500 ఎకరాలలో "అనాబ్-ఎ-షాహి" రకంపండించబడుతున్నదని వ్యవసాయమంత్రి శ్రీ బలరామిరెడ్డి నేడు రాష్ట్రశాసన మండలిలో శ్రీ వి. పి. రాఘవాచారి ప్రశ్నకు సమాధానమిస్తూ చెప్పారు.

రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ పరిశోధనసంస్థలో "అనాబ్ ఎ-షాహి" రకము ద్రాక్షపై వ్యవసాయ శాఖ పరిశోధన జరుపుచున్నదని మంత్రి తెలిపారు.

హైదరాబాదులోనూ, వెలుపల కూడా ద్రాక్షపంట ఉత్పత్తిపట్ల ప్రజలకు ప్రోత్సాహము ఇవ్వడానికిగాను 1961-62వ సంవత్సరమునుండి ప్రభుత్వము సబ్సిడీ పథకముకూడా అమలు పరుస్తున్నదని మంత్రి తెలిపారు.

కనీసము రెండు ద్రాక్షమొక్కలు గల యూనిట్ ఒక్కంటికి రూ. 20 చొప్పున చిన్నతరహా ఉత్పత్తిదారులకు, కనీసము 10 సెంట్ల భూమిలో 15 చెట్లుగల యూనిట్ ఒక్కంటికి 250 రూపాయల చొప్పున పెద్ద ఉత్పత్తిదారులకు 1961-62, 1962-1963 సంవత్సర కాలములో సబ్సిడీ మంజూరు చేయబడిందని తెలిపారు.

సికింద్రాబాదు-హైదరాబాదు జంట నగరాలలోని చిన్నతరహా ఉత్పత్తిదారులే 1963-64వ సంవత్సరములో సబ్సిడీ పరిమితము చేయబడిందనీ ఆయన అన్నారు.

... .

బియ్యాన్ని పాతపరచే పద్ధతి

అమెరికన్ వ్యవసాయ సైంటిస్టులచే రూపొందింపు

వాషింగ్‌టన్, జులై 31

బియ్యాన్ని త్వరగా పాతబియ్యంగా మార్చేందుకు యు. ఎస్. వ్యవసాయ శాఖ సైంటిస్టులు ఒక పద్ధతిని కనిపెట్టారు.

కొత్తబియ్యంకన్నా పాతబియ్యం ఆహారంగా ఉపయోగించుటకు ఎక్కువగా ఇష్టపడుచున్నారు ప్రజలు.

కొత్త బియ్యాన్ని ఆరు గంటల కాలం 200 డిగ్రీల ఫారెన్‌హీట్‌లో ఉంచుతారు. ఇవి సహజంగా పాతబియ్యం వలె మారుతవి

....—

ద్వారకాబాయి, సుందర్ షాలకు ఘనసన్మానం

హైదరాబాద్, జులై 31

మాస్కోలో జరిగిన ఐదవ అంతర్జాతీయ మహిళా కాంగ్రెస్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించిన శ్రీమతి ద్వారకాబాయి, సుందర్ షాలను తిలక్ స్మారకహాలులో సన్మానించారు.

షాలిబండలోని "కష్టజీవి మండలి" మహిళా సమితి, హైదరాబాద్ డెమోక్రటిక్ మహిళా సంఘం, ఆంధ్ర మహిళా సభల సంయుక్త ఆధ్వర్యాన ఈ సన్మానం జరిగింది.

శ్రీమతి అరుట్ల కమలాదేవి అధ్యక్షత వహించారు.

ఇండియా, మాస్కోలకుసంబంధించి ఒక విద్యా విషయక ఫిల్మును కూడా ప్రదర్శించారు.

ఈ సంయుక్త సమావేశం రెండు తీర్మానాలను ఆమోదించింది. వొకటి అణ్వాస్త్ర పరీక్షల పాక్షిక నిషేధఒప్పందం పట్ల హర్షం వెలిబుచ్చింది.

రెండవది ఇరాక్‌లో స్త్రీ, పురుషులపై జరుగుతున్న దారుణ అత్యాచారం పట్ల నిరసనను తెలియజేసింది.

ఈ అత్యాచారానికి వ్యతిరేకంగా తగు చర్య గయికోవాలనీ, ఇరాక్‌లోని సంఘటనలపై విచారణ జరిపించడానికి హేగ్ అంతర్జాతీయ సంఘాన్ని ఏర్పాటు చేయాలని ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ(?)ను కోరుతూ తీర్మానం గయికొనబడింది.

అగస్టు 4,5 తేదీలలో మిర్యాలగూడాలో విద్యా మహాసభ

నల్గొండ, జులై 31

నల్గొండజిల్లా మిర్యాలగుడలోఆగస్టు 4,5 తేదీలందు మిర్యాలగూడప్రభుత్వోపాధ్యాయ సంఘ శాఖాధ్వర్యమున విద్యా మహాసభ జరుగనున్నది.

నల్గొండజిల్లా చైర్మన్ సభకు ప్రారంభోత్సవం చేస్తారు. మిర్యాలగూడ సమితి అధ్యక్షులు సభకు అధ్యక్షత వహిస్తారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయ కాలేజీ ఆఫ్ ఎజ్యుకేషన్‌లో ప్రొఫెసరు శ్రీ కె. వేదాంతాచారి, కోఆర్డినేటర్ శ్రీ యస్. కిష్టారావు, టెయినింగ్ కాలేజిలో ఇంగ్లీష్ లెక్చరర్ శ్రీ సుబ్బుసుందరం, బేసిక్ విద్యోపన్యాసకులు శ్రీ వి. సత్యనారాయణమూర్తి, సోషల్ స్టడీస్ ఉపన్యాసకులు శ్రీ వామనరావ్ అంజుట్టి, మిర్యాలగూడ బేసిక్ టెయినింగ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ అబ్దుల్ హై, శాసన మండలి సభ్యులు శ్రీ వి.పి. రాఘవాచారి, ఉపాధ్యాయ సంఘాధ్యక్షులు, శ్రీ కె. రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీ కె.వి. యోగీంద్ర, నల్గొండ పరిషద్ ఉపాధ్యాయ సంఘాధ్యక్షులు శ్రీ టి. లక్ష్మారెడ్డి, కార్యదర్శి శ్రీ కె. శ్రీరామమూర్తి ప్రభృతులు యీ మహాసభయందు పాల్గొన నున్నారు.

అణ్వాయుధ పరీక్షల నిషేధసంధి: భావి ప్రయోజనాలు

అమెరికా, బ్రిటన్, సోవియట్ యూనియన్‌ల మధ్య జరిగిన అణ్వాయుధ పరీక్షల ప్రాక్షిక నిషేధపు సంధి సూత్రాలు ఈ మూడు రాజ్యాలను ఇప్పుడు ఎట్లా వర్తించబడుతవి అనే విషయంలో కాక, ప్రపంచ శాంతిక భవిష్యత్తులో తీసుకోదగు చర్యల విషయంలో ప్రాముఖ్యత గడిస్తున్నది.

వాతావరణంలో, అంతరిక్షములో, సముద్రాలలో అణ్వాయుధ పరీక్షలకు నిషేధించటంవల్ల అణ్వాయుధాలు కలిగి ఉన్న మూడు అగ్రరాజ్యాల పరిస్థితులలో ప్రస్తుతం పెట్టి మార్పు ఉండదు. ఇటీవల ఇట్టి పరీక్షలను ఈ మూడు రాజ్యాలలో ఏదీ జరపటము లేదు కాబట్టి, భవిష్యత్తులో మళ్ళ ఇట్టి పరీక్షలను ప్రారంభించే అవకాశంలేదు కాబట్టి, ఈ సంధి ఈ రాజ్యాలకు సంబంధించినంతవరకుఅప్పట్లో పెద్దమార్పు తీసుకరాగలిగినదేమీ లేదు.

అయితే సంధి ప్రకారం తమ తమ భూభాగాలలో ఇటువంటి పరీక్షలను ఖచ్చితంగా నిషేధించటం ద్వారానూ, ఇట్టి పరీక్షలను ప్రోత్సహించ రాదనీ "ఏ విధంగానూ, ఎక్కడా" ఇటువంటి పనులలో పాల్గొనరాదనీ, సమాధాన పడటం ద్వారానూ ఈ సంధిపై సంతకాలు చేయటానికి అన్ని రాజ్యాలను ఆహ్వానించటంద్వారానూ, ఈమూడు అగ్రరాజ్యాలు అణ్వాయుధాల నిరంతర ఉత్పత్తిని ఆపుచేయటానికి అంగీకరించినది. ఆయుధాల పోటీని నివారించటానికి వీరు తలపెట్టిన ఉపయోగకరమైన చర్య ఇది.

ఇది లక్ష్యాన్ని స్పష్టముగా వెల్లడిస్తున్నది. "అంతర్జాతీయ ఉద్రిక్తతల ఉపశమనానికి ప్రపంచశాంతి పటిష్టతలకు ముఖ్యమైన తొలిచర్య" అని గురువారమునాడు మాస్కోలో విడుదల చేయబడిన సంయుక్త ప్రకటనలోని మాటకు ఈసంధి తగినట్లుగా ఉన్నది.

పరోక్షముగా చూస్తే ఇది నిరాయుధీకరణ చర్యకాకపోవచ్చు. ఈసంధి ప్రకారము భూగర్భ పరీక్షలు నిషిద్ధం కావు. అయినా భూగర్భ పరీక్షలు జరపటములోని వ్యయ ప్రయాసల దృష్ట్యా ఈసంధి తక్కువ ప్రయోజనకరమైనదేమీ కాదు.

కనీసము ఈసంధిద్వారా వాతావరణాన్ని రేడియో ధార్మిక ధూళితో కలుషితం కాకుండా చేయటానికి ప్రాతిపదిక ఏర్పడింది. ఇదే ఒక పెద్ద విజయము. ఈసంధి చివరకు అన్ని రకాల అణ్వాయుధ పరీక్షలను అంతం చేయటానికి 1962 మార్చిలో జనీవా నిరాయుధీకరణ సమావేశములో సూచించబడిన సార్వత్రిక, సమగ్ర నిరాయుధీకరణ చర్యలకు దోహదకారి కాగలదు.

జూన్ 10న అమెరికన్ యూనివర్సిటీలో ప్రెసిడెంట్ కెనెడీ చేసిన ఒక ముఖ్యప్రసంగంలో సూచించబడినట్లు, నేటి అంతర్జాతీయ పరిస్థితులలో ఇది "ప్రపంచ శాంతికి చేయదగు కృషిలో" ఒక చర్య. "శాంతి సాధన ఒక పరిణామము. అది సమస్యల పరిష్కారానికి ఒక మార్గము" అన్న ప్రెసిడెంటు సిద్ధాంతానికి ఇది రూపీకరణ.

1958లో, అణ్వాయుధ పరీక్షల నిషేధాన్ని గురించి సమాలోచనలు ప్రారంభమైన నాటినుంచి అణ్వాయుధాలుకల రాజ్యాల చర్చలలో అవాంతరాలు ఏర్పడటానికి కారణము, అన్నిరకాల పరీక్షలను నిషేధించటానికి అవసరమైన తనికీ ఏర్పాట్లకు-పరిమితముగా సైనా - సోవియట్ యూనియన్ సుముఖముగా లేకపోవటమే. ఇందుకు జనీవా సమావేశంలో ఇప్పటికీ చర్చలు కొనసాగుతూనే ఉన్నవి. ఈ కారణముపల్ల గత ఆగస్టులో అమెరికా-బ్రిటన్‌లు పరీక్షల పాక్షిక నిషేధానికి ఒకసంధి మూసాయిదాను ప్రతిపాదించినవి. ఈరకము ముసాయిదా మీదనే గురువారమునాడుమాస్కోలో సమాధానము కుదిరింది.

మాస్కో సమాలోచనల ప్రారంభములో కుదుర్చుకొన్న ఒక ఏర్పాటు ననుసరించి, ఈసంప్రదింపులను గురించి, మధ్యలో ఎట్టి అధికార వ్యాఖ్యానము చేయబడలేదు, అయినా పత్రికలు మాత్రం అనధికార వార్తలను ప్రకటిస్తూనే వచ్చినవి.

తత్ఫలితంగా ఈ సమాలోచనలపట్ల ప్రపంచమంతా ఆసక్తి చూపటం జరిగింది. ఈ సంధిపై అందరూ సంతకాలు చేయవచ్చుననే ఆహ్వానాన్ని పురస్కరించుకొని అన్ని రాజ్యాలు ముందుకు రావటం ద్వారా సంధి లక్ష్యాలపట్ల ప్రపంచ వ్యాప్తమయినఆసక్తి, ముద్దగా ఇకముందు కూడా కొనసాగగలవు.

ఈ సంధిని ధృవపరచవలసి దని ప్రెసిడెంట్ కెనెడీ చేసిన విజ్ఞప్తిని సెనేటు పాటిస్తుందనుకొంటున్నారు. ఒక్క అమెరికాకు మాత్రమే అటం బాంబులు ఉన్నప్పుడు అణ్వాయుధాలను రద్దు చేయాలనే1946లో బరూచు ప్రతిపాదించిన పథకం మేరకు, అణుశక్తిని శాంతియుత కార్యాలకు వినియోగించాలనే తన విధానానికి మెరికా ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది.

అయితే సెనేటు ఈ సంధిని తాపీగానూ, దుణ్ణంగానూ, పరిశీలించి, అమెరికా, ఇతర మిత్రరాజ్యాల భద్రతకు ఈ సంధి సూత్రాలపట్ల ప్రమాదమేమీ ఉండదని తృప్తి కలిగిన తరువాత ధృవపరుస్తుంది.

ఏదయినా అసాధారణ సంఘటన వల్ల ఏ దేశపు ముఖ్యప్రయోజనాలకయినా ప్రమాదంవాటిల్లే పరిస్థితులు వాటిల్లేటట్టయితే మూడు మాసాల నోటీసు ఇచ్చి ఆ దేశం ఈ సంధినుంచి ఉపసంహరించుకోటానికి ఇందులో అవకాశం కల్పించబడింది. అయితే ఈ ఒప్పందానికి "కాలపరిమితి అంటూ ఉండకూడదనీ" ఈ మూడురాజ్యాలు వాస్తవిక దృక్పథంతో వ్యవహరించాలనీ, ఈ సంధి ఉద్దేశం, కట్టుదిట్టమైన అంతర్జాతీయ కంట్రోళ్ళక్రింద సార్వత్రిక, సమగ్ర నిరాయుధీకరణను వీలయినంత శీఘ్రంగా సాధించటం "ఈ సంధిముఖ్యలక్ష్యం"అని దీని ఉపోద్ఘాతములో ఉద్ఘాటించింది.

—(పాల్.ఎల్. ఫోర్డు)

— ....

ఉన్నత విద్యా ప్రమాణాలు

స్థాపనకు నియమావళి రూపొందించు కోవాలి

హైదరాబాదు, జులై 31

ఇటీవల జమ్మిస్తాన్‌పుర ప్రభుత్వోన్నత పాఠశాల ఉపాధ్యాయ సంఘ వార్షికోత్సవ సందర్భమున ఉపాధ్యాయ సంఘప్రతినిధులు ప్రసంగిస్తూ ప్రభుత్వపాఠశాలలలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్ప బడాలంటే, ఉపాధ్యాయులకు ప్రత్యేక నియమావళి అవసరమని చెప్పారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ పి.వి రామకృష్ణారావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ కె.వి. యోగీంద్ర, హైదరాబాదునగర ఉపాధ్యాయ సంఘాధ్యక్షులు శ్రీ వామనరావు అంజుట్టి, ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ టి. రాజమల్లారెడ్డి యీ సమావేశంలో ప్రసంగించారు. సహకార ఉద్యమాన్ని పటిష్టం చేయాలని కూడ వక్తలు ఉపాధ్యాయులను ప్రత్యేకముగా కోరారు.

పూర్వపు కార్యదర్శి శ్రీ శ్రీరామమూర్తి వార్షికనివేదికను సమర్పించారు. నూతన కార్యదర్శి శ్రీ టి. సుదర్శన్ కృతజ్ఞతా వందనములర్పించారు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు కేంద్రం ఋణాలు:

రాబడివచ్చేవరకు వడ్డీ సేకరణ ప్రసక్తితేరాదని రాష్ట్రం విజ్ఞప్తి

అసెంబ్లీలో మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి వెల్లడి

హైదరాబాదు, జులై 31

నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రిందగల భూములు సాగుబడి అయ్యి, రాబడి కలిగేవరకూ తాము ఇచ్చిన ఋణాలపై వడ్డీ వసూలుచేసే ప్రసక్తి తీసుకరాకూడదని రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసిందని ఆర్థిక మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి నేడు అసెంబ్లీలో వెల్లడించారు.

వడ్డీరేటుకూడా తగ్గించవలసిందిగా కేంద్రాన్ని అభ్యర్థించడం జరిగిందనీ కాని కేంద్రం ప్రస్తుతం అంగీకరించలేదని ఆయన చెప్పారు; కేంద్ర ఆర్థిక మంత్రి ఈ విషయాన్ని పరిశీలిస్తున్నారని మంత్రి చెప్పారు.

ఇతర ప్రాజెక్టుల వలె కాకుండా నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి అయితే నేరుగా నీరు అదాయం రావడం జరుగదన్న విషయాన్ని, అదువల్ల వడ్డీరేటుపై కన్సెషను ఇవ్వాలని మొరార్జీదేశాయి కొద్దికాలం క్రితం ఇక్కడికి వచ్చినపుడు తెలియచేశామని శ్రీ బ్రహ్మానందరెడ్డి చెప్పారు.

భారత సరిహద్దుల రక్షణ పరిస్థితి

లండన్, జులై 31

వైస్రాయితిరిగి భారతఉత్తరసరిహద్దులలో పైన్యాల కేంద్రీకరిస్తున్న విషయం బ్రిటన్ యునైటెడ్ స్టేట్సులకుఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉన్నదని భారత ప్రభుత్వంతో ఈ సందర్భముగా తాము సంబంధాన్ని కల్గిఉన్నామని బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ నిన్న కామన్స్ సభలో ఒకప్రశ్నకు సమాధానముగా తెలిపారు.

54 కోట్ల అప్పు

1963 మార్చి 31వ తేదీవరకు కేంద్రము ఈప్రాజెక్టుకు మొత్తము 54 కోట్ల 7 లక్షల రూపాయలు అప్పు ఇచ్చినదనీ ఆయన తెలిపారు. వడ్డీరేటు 3 శాతం నుండి నాలుగున్నర శాతము వరకూ వేర్వేరుగా ఉందన్నారు.

1963 మార్చి 31వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం 18లక్షల 48 వేల రూపాయలు వడ్డీ బాకీఉన్నదన్నారు.

ప్రాజెక్టు పూర్తి అయ్యేవరకు వడ్డీరేట్లు కలసి వచ్చేటట్టుగా వడ్డీలేకుండా ఋణ సహాయము చేయవలసి దిగా కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు.

1962 మార్చి 31 వరకు మాత్రమే అయ్యే వడ్డీరేట్లు కలసివచ్చేటట్టుగా ఋణాలు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది.

....—

రాయగిరిలో మహిళా శిక్షణ శిబిరం

ప్రతిగ్రామానికి ఒక మహిళా మండలి ఉండాలని ప్రమీల

నల్లగొండ, జులై 31

భువనగిరి జిల్లాలోని రాయగిరి గ్రామంలో స్త్రీలకోసం గ్రామ నాయకుల శిక్షణ శిబిరం మూడు రోజుల పాటు నిర్వహించబడింది. వివిధ గ్రామాలకు చెందిన 50మంది స్త్రీలు ఈ శిబిరంలో పాల్గొన్నారు.

మహిళాసంక్షేమ కార్యక్రమము, శిశుసంరక్షణ, కుట్టుపని, గ్రామీణ వలంటీర్ దళ పథకంవంటి తదితర విషయాలలో ఈ మహిళలకు శిక్షణ ఇవ్వబడినది.

వంచాయతి సమితి అధ్యక్షుడు శ్రీ టి. వి. పాపిరెడ్డి ఈ శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు. స్త్రీలు గ్రామీణ వాలంటీర్ దళంలోచేరి జాతీయ రక్షణ కార్యక్రమాల పట్ల అత్యంత ఆసక్తి ప్రదర్శించాలని శ్రీ ఆయన సలహా ఇచ్చారు.

శ్రీ జె. ఎడ్విన్ భాస్కర్ గ్రామీణ వాలంటీర్ దళం మూడు ఆశయాలను వివరించారు.

కుమారి ప్రమీల మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం మహిళా మండలుల ఏర్పాటు చేసుకోడానికిగాను స్త్రీలు ముందుకు రావాలని అన్నారు.

స్త్రీల అభ్యున్నతికయి ప్రతిగ్రామాలోనూ ఒక మహిళా మండలిని ఈ అత్యవసర పరిస్థితిలో నె

ప్రధానోపాధ్యాయునికి వీడ్కోలు

విశాఖపట్నం, జులై 31

విశాఖపట్నం తాలూకా ఎనకతలలో హైదరాబాదు స్టేట్ పరిషత్ మాధ్యమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రాష్ట్రోపాధ్యాయ సంఘ ఉపాధ్యక్షులు శ్రీ నిట్టల సుబ్రహ్మణ్యం పోలాకి బదిలీ అయిన సందర్భములో యెనకతల గ్రామస్థులు ఘనమైన వీడ్కోలు సన్నాహాలు చేశారు.

స్థానిక సర్పంచ్ శ్రీ కృష్ణారెడ్డి సభకు అధ్యక్షత వహిస్తూ, శ్రీ సుబ్రహ్మణ్యం గత రెండు సంవత్సరాలలో యెనకతల పాఠశాలకు చేసిన సేవను ప్రశంసించారు. శ్రీ సుబ్రహ్మణ్యము కృషి వల్లనే 8వ తరగతి ప్రారంభింపబడడం, విద్యార్థుల శ్రమదానంతో క్రొత్త భవనం నిర్మించబడడం ఆదర్శనీయమని ప్రస్తుతించారు. శ్రీ అడివి రెడ్డి, శ్రీ మురళీధర్, శ్రీ భద్రయ్య కూడ సభలో మాట్లాడారు. బ్యాండు మేళముతో గ్రామస్థులంతా ప్రధానోపాధ్యాయుని సాగన పారు.

మెసర్స్ కల్యాణసూర్యనారాయణ

ఉస్మాన్‌గంజ్ అండ్ కమీషన్ ఏజంటు
నెం. 41412 (42262)
హైదరాబాద్, జులై 31
(క్వింటల్ ధరలు)

(క్వింటల్ అంటే 100కిలోగ్రాములు)	
పాలాకులుబియ్యం	55-00 58-50
గుజ్జులు	60-00 62-00
19 నెంబర్లు	54-00 58-00
దొడ్డుబియ్యం	50-00 52-00
బసంగి	50-00 53-00
నాణకరాములు	56-00 60-00
బంగారుతీగెలు	66-00 69-00
గొట్టెబియ్యం	45-00 49-00
ఎ4 నెంబర్లు	67-00 69-00
25.కె.కె. బియ్యం	66 00 69-00
కొత్తసాంబర్లు	64-00 74-00
పాతసాంబర్లు	68-00 77-00
తుసుమబియ్యం	59-00 61-00
పచ్చనూలు	33-00 35-00
చట్టిజొన్నలు	32-00 34-00
తెల్లజొన్నలు	40-00 45-00
పసుపు	140-00 145-00
పెద్దబి	58-00 69-00
కందులుచిన్నవి	52-00 56-00
మినుములు	55-00 65-00
సెనగలు	44-00 46-00
పెసలు	32-00 44-00
ఉలవలు	31-00 32-50
తెల్లం	90-00 100-00
మిరపకాయలు	200-00 280-00
చింతపండు	30-00 45-00
పుల్లిగడ్డ	22-00 27-00
యెల్లిగడ్డ	85-00
తెల్లనువ్వులు	85-00 100-00
ఆముదాలు	54-00 56-00
ధనియాలు	70-00 75-00
కుసుమలు	43-00 46-00
ఇలాతిపల్కు పెద్దది	104-00 107-00
ఇలాతిపల్కు సం॥కి	70-00 82-00
బన్సీగోధుమలు	60-00 63-00
శర్బతిగోధుమలు	58-00 65-00
కందిపప్పు పెద్దది	86-00 88-00
కందిపప్పు చిన్నది	79-00 82-00
సెనగపప్పు	55-00 56-00
మినుపపప్పు	90-00 95-00
పెసరపప్పు	60-00 65-00
పల్కు నూనె 10కిలో	17-50 17-62
కల్నిపిండి	26-00
ప్రత్తిగింజలు	34-00 38-00

ఒక మలిగె అమ్మకము

అడ్జల్ గ్రామ పోలీసుగౌడు దగ్గర ఒక మలిగె నం 15-3-110 అమ్మకమునకు కలదు. ప్రస్తుతం ఈ మలిగెలో సుల్తాన్ అడ్డంపెట్టి కిరాయకుంటున్నది. ఈ సంబరు మలిగె కొనదలుచున్నవారు యీ విషయమును గురించి తిరువనంతపురములోని లెనిఫోను నంబర్లలో మాట్లాడవచ్చును.

ఫోను నంబర్లు:
33006
35892

13 వ వారం!
నేడు అఖండ రోజు
అనురూపం వారి: "అనురాగం"
(తెలుగు సాంఘిక చిత్రం)
దర్శకత్వం: రామినీడు. సంగీతం: పెండ్యాల.
తా: భానుమతి, జి. వరలక్ష్మి, గుమ్మడి, రేలంగి, రమణారెడ్డి, గిరిజ.
సాగర్- హైదరాబాద్
ఆటలు: 2-30, 6-00, 9-30. (వాణి విడుదల)

దశల వారీగా అంక్లేశ్వర్ నూనెగనుల విస్తరణ

త్వరలో రోజుకు 2 వేల టన్నుల నూనె ఉత్పత్తి సాధ్యం

బరోడా, జులై 31

అంక్లేశ్వర్ నూనెగనుల నుండి రోజుకు రెండు వేల టన్నుల నూనెను వచ్చేనెల నుండి ఉత్పత్తిచేయ ఇంధన తైల ఖనిజ వాయువు కమిషన్ ప్రయత్నిస్తున్నది.

ప్రస్తుతం ఈ నూనెగనుల్లో రోజుకు 1800 టన్నుల నూనె తీయబడి బొంబాయిలోని నూనె శుద్ధి కర్మాగారాలకు పంపబడుతున్నది. ఇక్కడ వెలికి తీయబడే నూనెను రవాణా చేయడానికి అదనపు నూనె ట్యాంకర్లతో కమిషన్ ఏర్పాట్లు చేస్తున్నది. వచ్చే నెలలో ఎప్పటి నుండి రోజుకు రెండువేల టన్నుల నూనె ఉత్పత్తి చేయబడేది ఇంకా నిర్ధారితం కాలేదు.

అంక్లేశ్వరు నూనెగనులలో ఉత్పత్తి హెచ్చింపు దశలవారీగా పెంచబడుతున్నది. ఈగనులలో తొలుత ఉత్పత్తి వందటన్నులతో ప్రారంభమైంది. ఈ ఉత్పత్తి సాలీనా 50 లక్షల టన్నులకు పెంచబడింది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 15 నుండి రోజుకు 18 వందల టన్నుల నూనె ఉత్పత్తి చేయబడుతున్నది. ఈ సంవత్సరాంతంవరకు ఈ గనుల్లో రోజుకు 2 వేల 2 వందల 50 టన్నుల నూనె ఉత్పత్తి సాధింపబడుతుంది. గుజరాత్‌లో నూనెశుద్ధి కర్మాగారం ఏర్పాటయి పనిప్రారంభించే వరకు అంక్లేశ్వరు నూనె గనులలో ఇంకా ఎక్కువ నూనె ఉత్పత్తి చేయబడే అవకాశంలేదు.

గుజరాత్ నూనెశుద్ధి కార్మాగారం రెండవ దశ పూర్తి అయిన ఈ నూనె గనులలో రోజుకు అదనముగా మరో ఆరు వందల టన్నుల నూనె ఉత్పత్తి చేయబడుతుంది.

పశ్చిమ బెంగాల్‌లో గ్రామీణ వాలంటీర్ దళాలు

కలకత్తా, జులై 31

432 వేల సభ్యత్వంగల 17 వేల గ్రామవాలంటీర్ దళాలు పశ్చిమ బెంగాల్‌లో ఏర్పరచబడ్డాయి.

ఈ రాష్ట్రములో ఏర్పరచబడిన రక్షణ శాఖమిక బ్యాంకులందు చేరిన వారు రు 3554 వేల విలువగల శ్రమదానాన్ని ఇవ్వనుద్దేశపడినారు.

మూడు ఈజిప్షియన్ బాంబరు విమానాలు

తాము కూల్చివేసినటుల యెమెన్ రాయలిస్టుల ప్రకటన

బర్దాన్, జులై 31

గడచిన కొన్ని రోజులలో మూడు ఈజిప్షియన్ ఇల్యుషిన్ బాంబరు విమానాల యెమెన్ రాయలిస్టు దళాలు కూలగొట్టినవని మొరాక్కో రేడియో ప్రకటించింది.

సానాకు వాయవ్యంగాను ఈశాన్యంగాను రాయలిస్టు దళాలు రిపబ్లికన్ దళాలతో పోరాటం జరుపుతున్నాయి.

ఉత్తరప్రదేశ్ మంత్రి మండలి రద్దుచేయాలి

మధ్యాంతర ఎన్నికలు జరిపించాలని కమ్యూనిస్టు పార్టీ డిమాండ్

ఘజియాబాద్, జులై 31

ఉత్తర ప్రదేశ్ మంత్రిమండలి రద్దు చేసి, మధ్యాంతర ఎన్నికలు జరిపించాలని ఉత్తరప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీ వార్షిక సమావేశం డిమాండ్ చేసింది. "ఒక ప్రత్యేకమైన పరిస్థితి"ని రాష్ట్రం యెదుర్కొంటున్నదని, రాష్ట్రంలోని ప్రజాస్వామిక వితానికే అవరోధము కలిగే ప్రమాదం సంభవించనున్నదని ఈ సమావేశం ఒకతీర్మానంలో పేర్కొన్నది.

హిందీయేతర రాష్ట్రాలకు హిందీగ్రంథాల బహూకరణ

కేంద్ర విద్యామంత్రిత్వశాఖ పథకం

న్యూఢిల్లీ, జులై 31

హిందీనిరాభిమానిగానిలిచి కనిష్టయంగా గానిపోతున్న హిందీ మాతృభాషకాని రాష్ట్రాలలోని పాఠశాలలు, కళాశాలలు, పల్లెకు గ్రంథాలయాలకు అవసరమయిన హిందీ గ్రంథాలను ఉచితముగా యివ్వడానికి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ తలపెట్టింది.

హిందీయేతర ప్రాంతాల వారికి హిందీభాషపట్ల ఆసక్తిని పెంపొందించడానికి, హిందీభాషను వ్యాప్తిలోకి తీసుకురావడానికి యిది ఉద్దేశించబడింది.

ఇందునిమిత్తం హిందీ నవలలు, కథలు, నాటకాలు, పద్యకావ్యాలు, వ్యాసమంజస్లు, యాత్రా గ్రంథాలు, జీవితచరిత్రలు, ఆత్మకథలు, చరిత్రలు, సాంస్కృతికగ్రంథాలు, శాస్త్ర గ్రంథాలు, పర్యావరణగ్రంథాలు, బాలలగ్రంథాలు పాఠ్యపుస్తకాలతో కొనడానికి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ ఏర్పాటు చేసింది. మూలగ్రంథాలేగాక కొన్ని అనువాద గ్రంథాలనుకూడ ఖరీదు చేయనున్నారు. గత మూడేళ్ళలో ప్రచురణఅయిన గ్రంథాలనుంచేవిటిని ఎంచుకుంటారు. ఒక్కొక్క ప్రచురణ వద్దనుంచి ఒక్కొక్క విషయంపై మూడు గ్రంథాలకుమించి కొనరు.

ప్రభుత్వం కొనుగోలు చేయడానికి గ్రంథాలను ఎంచుకునే దుకు అర్హులైనవారితో ఒకసంఘాన్ని ప్రభుత్వం నెలకొల్పనున్నది.

గ్రంథాలను విక్రయించగోరు, గంథ విక్రేతలు, ప్రచురణ కర్తలు అటి హిందీగ్రంథాల రెండుప్రతులు 1969 సెప్టెంబరు 15 లోగా ఈ క్రింది చిరునామాకు పంపాలి: శ్రీ రాజేంద్ర నారాయణ్, అండర్ సెక్రటరీ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, "యం" బ్లాకు, న్యూఢిల్లీ. ఆ తేదీ తర్వాత చేరిన గ్రంథాలు పరిశీలించబడవు.

భారత సహాయక దేశాల సమావేశం

వాషింగ్టన్, జులై 31

భారతదేశపు తృతీయ పంచవర్ష ప్రణాళిక పథకాల అమలుకు మరికొంత ఆర్థిక సహాయంచేసే ప్రతిపాదనను పరిశీలించుటకై ఎయిడ్ ఇండియా క్లబ్ వచ్చే వారంలోనే సమావేశం కాగలదని నిన్న ఇక్కడికి తెలియవచ్చింది.

ఈ వారాంతంలో క్లబ్ సమావేశము జరుగుతుందని అంచనా వేయబడినది.

అణు పరీక్షల నిషేధ ఒప్పందం

ప్రపంచ ప్రజల మోసగించడానికి జరిగిన కుతంత్రమే మాస్కోలో అగ్రరాజ్యాలు రూపొందించిన అణుపరీక్షల నిషేధ ఒప్పందమని చైనా ప్రజా రిపబ్లిక్ ప్రకటించింది.

పెకింగ్, జులై 31

ప్రపంచ ప్రజల మోసగించడానికి జరిగిన కుతంత్రమే మాస్కోలో అగ్రరాజ్యాలు రూపొందించిన అణుపరీక్షల నిషేధ ఒప్పందమని చైనా ప్రజా రిపబ్లిక్ ప్రకటించింది. ఈ ఒప్పందము ప్రజల అభీష్టానికి వ్యతిరేకమని వ్యాఖ్యానించినటుల సవరైనా వార్తా సంస్థ తెలుపుతున్నది.

బోర్నియో తిరుగుబాటుదారులకు ఇండోనీషియా ఆయుధాల సరఫరా

జకార్తా, జులై 31

ఉత్తర బోర్నియో తిరుగుబాటుదారులకు ఇండోనీషియా అవసరమైతే ఆయుధాలుసరఫరా చేస్తుందనీ ఇండోనీషియా రక్షణమంత్రి అడ్మిరల్ హార్టోనో అన్నారు.

మలేసియాను విభజించేయడానికి ఇండోనీషియా ప్రజలు ముందంజ వేయాలని ఆయన అన్నారు.

మలయాలోని ఆంధ్రుల భాషాభిమానం

కౌలాలంపూర్, జులై 31

మాలయాలోని కౌలాలంపూర్ నగరం నుండి శ్రీ ఎస్. బి. రెడ్డి ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు:-

వేల కొలది ఆంధ్రులు విదేశాలలో నివాసమేర్పరుచుకొని తమ స్వోపాధిని గడుపుకొనుచున్నారను విషయం విశాలాంధ్రులందరికీ తెలిసియే యుండవచ్చును. అతివృష్టి, అనావృష్టి వల్ల సంభవించుచున్న కరువులలోను, కష్టకాలములలోను, మాతృ దేశమును విడచి మలయాకు చాలామంది ఆంధ్రులు వచ్చి యిక్కడనే స్థిరనివాస మేర్పరచుకొన్నారు.

ఇట్లు వచ్చిన వారిలో విద్యావంతులు చాలా తక్కువ. కూలీల సంఖ్య చాలా అధికం. మొదటి నుంచి విద్యావంతులకు పట్టణములలో, కార్మికులకు రబ్బరు తోటలో, కొబ్బరి తోటలలో ఉద్యోగం లభించింది. పట్టణములలో తెలుగు తెలిసిన కొద్ది పాటి విద్యావంతులతో పాటు పురపాలక సంఘములలో రోడ్లు వూడ్చువని, పాకపని చేసే తెలుగువారు కూడా చాల అధికం. ఈ లేక పని చేయువారు మాత్రము తెలుగు భాషను మాట్లాడుచున్నారు. యిది ఒక అల్పజాతి భాషయని ఆంధ్రేతరుల అభిప్రాయము. కావున తెలుగు తెలిసిన విద్యావంతులు కొందరు తెలుగు మాట్లాడిన తాము గూడా అల్పజాతికి చేరిన వారుగా లెక్కింపబడుదురనుభయముచే మాతృభాషను మరచి వారి బిడ్డలకు అరవముతో, ఆంగ్లముతో బాల్యము నుండియే నేర్పించారు.

కాని తోటలలో పనిచేయు కార్మికులు మాత్రము తమ మాతృ భాషకు దోహము చేయక యిప్పటికిని భాషాభిమానులుగనే యున్నారు. వారి బిడ్డలు మలయా ప్రభుత్వ సహాయంచే స్థాపించబడిన తెలుగు పాఠశాలలలో అయిదారు తరగతుల వరకు చదివి శక్తియున్నవారు ఆంగ్లపాఠశాలలలో ఉన్నత విద్య నభ్యసిస్తున్నారు. ప్రస్తుతము సుమారు 40 తెలుగు ప్రాథమిక పాఠశాలలున్నవి.

అందులోని కొందరు వుపాధ్యాయులు, వారివద్దను చదివిన శిష్యులు, యితర తెలుగు భాషాభిమానులు, తెలుగు భాషను, కళాచారములను అభివృద్ధి పరచుటకై "జ్యోతి ప్రెస్" అను ముద్రణాలయమును సుమారు రూ. 75,000 మూలధనముతో యీ సంవత్సరమే స్థాపించారు.

ఇందు తెలుగులో పత్రికను ప్రస్తుతము ప్రారంభించి కొలది దినములలో దానిని వారపత్రికగ మార్చవలెనని మా వుద్దేశము. ఈ పత్రిక పేరు "విదేశాంధ్ర". మలయాలో తెలుగు భాషాభిమానులు చాల మంది వున్నప్పటికి, విద్యావంతులు, పండితులు లేనందున వ్యాసరచన ద్వారా పత్రికకు సేవజేయగలవారు చాల కొలది మంది మాత్రమే వున్నారు. కావున విదేశాంధ్ర జయప్రదముగ నడచును, ఆంధ్రుల ప్రతిభను విదేశాలలో గూడా ప్రచారంచవలెనంటే ఆంధ్రప్రదేశ్ రచయితల ఆదరాభిమానములు మాకు తయు అవసరము.

మలయాలో అరవమున మూడు దిన పత్రికలు, పంజాబీ, మళయాళ భాషలలో ఒక్కొక్క దినపత్రిక, యింకా లెక్క లేనన్ని వార పత్రికలు వున్నవి. కాని తెలుగులో ఒక్క పత్రికగూడా ముద్రణా రూపములో లేదు. తమిళుల తర్వాత యీ దేశములో ఆంధ్రులే అధికము. అయినప్పటికి మనవారి నాటికి వెనుకబడియున్నారు. అందులకు ముఖ్యకారణము తెలుగు పత్రిక లేకపోవడమే యని చెప్పవచ్చును.

కావున ఆంధ్ర సోదర రచయితలందరు మలయాంధ్రుల అభ్యుదయమునకై స్థాపించిన "విదేశాంధ్ర" పత్రిక దీర్ఘాయుస్సుకై తోడ్పడి, ఆంధ్రమాతకు సేవజేయగలరని ఆశిస్తున్నాను. ఇకను గౌరవనీయులగు పత్రికా సంపాదకులు, సుప్రసిద్ధులగు ప్రజానాయకులు తమ ఆశీస్సులనంపి ఆదరాభిమానముల జూపవలయునని కోరుచున్నాను. మీ రచనలను దయచేసి యీక్రింది చిరునామాకు పంపండి. ఎడిటర్ జ్యోతి ప్రెస్ లిమిటెడ్ పోస్టు బాక్సు నెంబరు 2048 కౌలాలంపూర్, మలేయా.

మాస్కోలో ఎస్. ఎ. డాంగే

మాస్కో, జులై 31

భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర సమితి అధ్యక్షులు ఎస్. ఎ. డాంగే నిన్న మాస్కోకు చేరారు.

"లడఖ్‌లోని మన భూభాగముపై చైనీయులు ఇంకా తిష్ఠవేసుకుని కూర్చున్నారు" అన్నారాయన. ప్రమాదము ఇంకా తొలగి పోలేదన్నారు.

జీవితావసర వస్తువుల ధరల పెరుగుదల

నిరోధానికి సహకారస్టోర్సు తోడ్పడతాయని శ్రీమతి సిన్హా అభిప్రాయం

బొంబాయి, జులై 31

జీవితావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల పరిమితాదాయ కుటుంబాల బాధలు పెరిగాయని కేంద్ర ఆర్థిక ఉపమంత్రి శ్రీమతి తారకేశ్వరి సిన్హా నిన్న సాయంత్రం ఇక్కడ పేర్కొన్నారు.

ప్రభుత్వం సరసధాన్యపు దుకాణాలను సహకార స్టోర్స్‌ను తెరవడము ద్వారా ధరల అదుపులోనికి తేవడానికి ప్రయత్నిస్తున్నదని అనతి కాలంలోనే దేశ వ్యాప్తముగా వినిమయదారుల సహకార స్టోర్స్ ఏర్పరచ బడటంవల్ల సరసమైన మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పడి ధరలు అదుపులోకి రాగలవని ప్రభుత్వం ఆశిస్తున్నదని శ్రీమతి సిన్హా రక్షణ అవసరాలకు సంబంధించిన పరిశ్రమల స్థాపించడంలో వాణిజ్య వర్గాలు చక్కువ శ్రద్ధ తీసుకోవాలని అభిప్రాయపడినారు.

బంగారు నగలు నిబంధనల ప్రస్తావిస్తూ వీని వలన దొంగచాటుగా మన దేశానికి బంగారాన్ని చేర్చే వ్యాపారం చాలా తగ్గిపోయి విదేశీ మారక ద్రవ్యం మిగులుతున్నదన్నారు వీరు.

ప్రజలు అప్రమత్తత వహించాలని నెహ్రూ ఉద్బోధ

న్యూఢిల్లీ, జులై 31

చైనా ప్రమాదము దృష్ట్యా, అనుక్షణము అప్రమత్తముగా ఉండాలని ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సరిహద్దుపై చైనా ఇటీవలనే తన సైనిక శక్తిని పెంచుకున్నదని అన్నారు. టిబెట్‌లో వారు పెద్ద మొత్తములో సైనికదళాలనుకూడా సమకూర్చుకున్నారనీ, వారి నిజమైన ఉద్దేశ్యాలేమిటో ఎవ్వరూ చెప్పజాలరని, అయితే వారి ఉద్దేశ్యాలు మాత్రం సక్రమమైనవి కావన్నది నిస్సందేహము విస్పష్టమవుతున్నదని ఆయనఅన్నారు.

మహారాజా రంజిత్‌సింగ్ 124వ వార్షికజయంతి ఉత్సవములో ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ పై విధముగా అన్నారు.

గత అక్టోబరులో చైనా దురాక్రమణ జరిపిన ఫలితముగా ఇండియా సమైక్యము అయినదనీ, కానీ ఆ తరువాత ప్రజలు పరస్పర కలహాలకు పాల్పడ్డారనీ ప్రధాని ప్రభృతులు అన్నారు.

ఆజాద్ కాశ్మీర్ సైన్యానికి జెట్ విమానాలు

శ్రీనగర్, జులై 31

ఆజాద్ కాశ్మీర్ సాయుధదళాలకు జెట్ ఫైటర్ల విభాగాన్ని పాకిస్తాన్ ప్రభుత్వం గోప్యంగా ఏర్పాటు చేస్తున్నట్టుల విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తున్నది. ఆజాద్ కాశ్మీరు సైన్యపు విమాన విభాగానికయి ఇటాలియన్ జెట్ విమానాలు సంపాదించబడుతున్నట. ఆజాద్ కాశ్మీరుకు 19 ఇటాలియన్ సైనికులు, వీనికి తేలికరకం ఆధునికఆయుధాలు సమకూర్చబడినవి. యుద్ధానంతర స్టేట్సు నుండి పాకిస్తాన్ పొందిన సైనిక సామాగ్రే ఆజాద్ కాశ్మీరు సైన్యానికి ఇవ్వబడినది.

తొలుత పాక్ ఆధీనిత కాశ్మీరు ప్రాంతానికి 24 ఇటాలియన్ల సైన్యం ఉండేది. కాని రెండుసంవత్సరాలక్రితం ఆజాద్ కాశ్మీరు సైన్యం పునర్‌నిర్మింపబడి 19 ఇటాలియనులు చేరుపబడినది. ఈ ఇటాలియన్ అధికార్లనాశ్రయించి పాకిస్తాను సైనికాధికార్లే పాకిస్తాన్ సైన్యాధ్యక్షుల కమాండ్‌లోనే ఇవి ఉంటాయి. గత సంవత్సరం ఈ ఆజాద్ కాశ్మీరు దళాలలో పాక్ అధికార్ల నాయకత్వంపై అసంతృప్తి పెరిగింది.

పెకింగ్ రివ్యూ పత్రిక

అసెంబ్లీలో ప్రశ్న

హైదరాబాదు, జులై 31

చైనాపై ముదిరిపోయే పెకింగు రివ్యూపత్రిక ఆంధ్రప్రదేశ్‌లోనికొందరికి పంపబడుతున్న మాట నిజమేనా? వారెవరు అని రాష్ట్ర శాసన సభలో వేయబడిన ప్రశ్నకు ముఖ్యమంత్రి సమాధానమివ్వ నిరాకరించారు.

ప్రభుత్వం ఇట్టి చైనాప్రచారాన్ని నిరోధించడానికి ఏమైనా చర్యలుతీసుకుంటున్నదా? అని అడుగగా అవునన్నారు.

ఉపాధ్యాయుల తొలగింపు పట్ల మెదక్ జిల్లాలో అసంతృప్తి

సంగారెడ్డి, జులై 31

మెదక్ జిల్లా ఉపాధ్యాయ సంఘ ద్వితీయకార్యవర్గ సమావేశం కొద్ది కాలంక్రితం సంగారెడ్డిలోసమావేశమై మెట్రిక్యులేటు మరియు ఫెయిల్డు మల్టిపర్పస్ ఉపాధ్యాయుల తొలగింపుపట్ల తీవ్ర ఆక్షేపణను ప్రకటించింది.

సమావేశమునకు మెదకు జిల్లా ఉపాధ్యాయసంఘాధ్యక్షులు శ్రీ వి. విఠల్ రెడ్డి అధ్యక్షత వహించారు. కేంద్రసంఘపు కార్యదర్శి శ్రీ ఆనంద రావుతోటి కూడ చర్చలలో పాల్గొన్నారు. జిల్లాపరిషత్తులు, సమితుల ఉపాధ్యాయులకుకూడా వైద్యసహాయము ప్రభుత్వం విస్తృతంచేయాలని కంజ్యూమర్ కోఆపరేటివ్ స్టోర్సు టీలు కిచ్చే క్రెడిట్‌పోతిట్లను స్థానిక సంస్థల ఉద్యోగులకు కూడా అనువర్తింపచేయాలని తీర్మానాలలో కోరబడినది.

కాంగ్రెస్ సంస్థను సంస్కరించడం

అంతా చర్చిస్తున్నది ఇదేనని భక్తవత్సలం వివరణ

న్యూఢిల్లీ, జులై 31

గతవారం ప్రధాని నెహ్రూతో కామరాజ్ నాడార్ జరిపిన సంప్రదింపులు కాంగ్రెస్ సంస్థకు సంబంధించిన విషయాలని మరాష్ట్ర హోంమంత్రి ఎం. భక్తవత్సలం తెలిపారు.

మద్రాస్ మంత్రివర్గంలోను, కాంగ్రెస్ సంస్థలోను మార్పులకూర్చి పత్రికలలో వచ్చిన వార్తలు కేవలం ఊహాగానాలని వీరన్నారు. ఇప్పుడు అందరినోట చర్చింపబడుతున్న అంశం కాంగ్రెస్‌సంస్థను పటిష్ఠం చేయడం దీనిని కాంగ్రెస్ నాయకులు చర్చిస్తూనే ఉన్నారు.

భిలాయ్ కర్మాగారంలో ఉక్కు ఉత్పత్తి పెరుగుదల

ఉత్పత్తిని 2.5 లక్షల టన్నులకు పెంచడానికి విస్తరణ కార్యక్రమం

రాంచీ, జులై 31

భిలాయి ఉక్కు కర్మాగారపు వివిధ దశలలో విస్తరణ మరియు నిర్మాణపు పనులు జరుగుతున్నాయి. ఈ కర్మాగారపు ఉత్పత్తి పెరిగినట్లు జనరల్ మేనేజరు ఇంజనీరింగ్ తెలిపారు.

భిలాయిలో సాలీనా ఉక్కు ఉత్పత్తిని ఒక మిలియన్ టన్నులనుండి 2.5 మిలియన్ టన్నులకు పెంచడానికి ప్రస్తుత విస్తరణ కార్యక్రమం కొనసాగుతున్నది. ఈ కర్మాగార విస్తరణకై సోవియట్ యూనియన్ నుండి 2 లక్షల పదివేల టన్నుల సామగ్రి కావాలి ఇందులో 88500 టన్నుల సామగ్రి ఈ మధ్యనే రష్యా నుండి వచ్చింది.

ఆఫ్రికా ఆర్థిక కమిషన్ నుండి దక్షిణాఫ్రికా బహిష్కరణ

జెనీవా, జులై 31

ఆఫ్రికా ఆర్థికకమిషన్ కార్యకలాపాలలో దక్షిణాఫ్రికా పాల్గొనరాదని సమితి ఆర్థిక సాంఘికసమితి నిన్న తీర్మానించింది.

ఈ తీర్మానాన్ని అర్జెంటీనా ప్రతిపాదించగా దీనికి అనుకూలముగా ఆరు, ప్రతికూలముగా రెండుహస్తాలు వచ్చాయి. పదిరాజ్యాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు.

స్కాపుల్జె పరిసరాలలో భూమిబీటలు

స్కాపుల్జె, జులై 31

స్కాపులె ప్రాంతంలో రెండువిధాల భూమిబీటలు వారిందని ఇదివరకే ఈ ప్రాంతములోని పర్వతభాగాలు కూలే అవకాశం ఉన్నదని భూతత్వశాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

ఇక్కడి వాడ్నార్ నదికి సమీపంలోగల వాడార్ నదికి సమీపంలోగల గుట్ట దక్షిణ 200 గజాల పొడవు మార్గం అంగుళాల వెడల్పు లోతయిన బీటలు కాన్పించినవి.

ఇప్పటివరకు స్కాపుల్జె జిల్లాల నుండి వెయ్యికి పైగా శవాలు వెలికి తీయబడినవి.



హైదరాబాద్-ఎ

శుక్రవారం ఆగస్టు 2

405.4 మీ (740 కిలో సై)

ఉ॥ 6-30 సుప్రభాత్, 6-40 ఆం-వా, 6-45 భక్తి రంజని: రామదాసు కీర్తనలు, 6-55 సూక్తి ముక్తావళి, 7-00 తె-వా, 7-15 ప్రస్తుతాంశం, 7-20 గాంధీమార్గము, 7 30 బి. తెల్లాయి: వీణ, 7-45 ఎస్. ఎ. మహద్‌కర్: ఖయాల్, 8-00 ఆం-వా, 8-15 దేశభక్తి పాటలు, 8-30 ఎమ్. కేశవరావు, పి. కుప్పుస్వామి: వయొలిన్ సుస్వరం, 9-00 పత్రికా సారాంశము.

మ. 11-40 మాధ్యమిక పాఠశాలలకు, 12-10 పాఠశాలకు (ఉర్దూ), 12-30 కార్మికుల కార్యక్రమము, 1-00 వనితావాణి, 1-40 హిం-వా, 1-50 తె-వా, 2-10 ఉ-వా, 2-30 పత్రికా సారాంశము.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-20 మరాఠీ శ్రోతలకు, 7-00 తె-వా, 7-15 గాంధీపథ (హిందీ), 7-45 కర్ణాటక సంగీత కచేరీ, 8-55 ప్రస్తుతాంశం 9-00 ఆం-వా, 9-15 ఉ-వా, 9-30 నాటిక, 9-45 ఎస్.ఎ. మహద్‌కర్: ఖయాల్, 10-30 ఆం-వా, 10-35, వాతావరణ సూచన, ప్రసార సమాప్తి, జనగణమన.

హైదరాబాద్-బి

42.02 మీ (7140 కిలో సై)

మ॥ 12-10 నేటిమాలిక, 2-00 వాతావరణ సూచన, 2-30 ప్రసార సమాప్తి.

60.12 మీ (4990 కిలో సై)

సా॥ 6-20 గ్రామస్థుల కార్యక్రమ, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమం, 7-30 జయశ్రీ నాటిక కర్నాటి. మారుతీరావు, 9-15 భారత్-చైనా భూతం, 9-30 నిష్కృతి నాటిక రచన: ఎస్. రామకృష్ణరావు, 9-15 వయొలిన్, 10-30 ఆం-వా, 10-35 వాతావరణసూచన, ప్రసార సమాప్తి, జనగణమన.

విజయవాడ

357.1 మీ (840 కిలో సై)

ఉ॥ 6-30 సుప్రభాతం, 6-35 ప్రసార విశేషాలు, 6-40 ఆం-వా, 6-45 భక్తిరంజని, 6-55 సూక్తి ముక్తావళి 7-00 తె-వా, 7-15 నేటి విశేషం, 7-20 గాంధీమార్గము, 7-30 వయొలిన్, 8-00 ఆం-వా, 9-00 ప్రసార సమాప్తి.

మ॥ 11-30 రాష్ట్రగానం 11-40 మాధ్యమిక పాఠశాలలకుమద్రాసు రాష్ట్రం, 12-10 భారతదేశ: చైనా ఘాతం. 12-20 లలిత సంగీతం, 12-30 కార్మికుల కార్యక్రమము, 1-00 వనితావాణి, 1-40 హిం-వా, 1-50 తె-వా, 2-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-20 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమం 7-30 జయశ్రీ రూపకం, 7-45 సంగీత కచేరీ, 8-55 ప్రస్తుతాంశం, 9-00 ఆం-వా, 9-15 భారత్-చైనా భూతం, 9-30 నిష్కృతి నాటిక రచన: ఎస్. రామకృష్ణరావు, 9-15 వయొలిన్, 10-30 ఆం-వా, 10-35 వాతావరణసూచన, ప్రసార సమాప్తి, జనగణమన.

రెండు సాయుధ పోరాట బటాలియన్‌లు
హైదరాబాద్, జులై 31
బాహ్య ఆత్మయిక పరిస్థితి రాష్ట్రాన్ని 1962-63లో రాష్ట్ర ప్రభుత్వం రెండు సాయుధ పోరాట బటాలియన్‌ల ఏర్పరచినట్లు ముఖ్యమంత్రి శ్రీ సంజీవ రెడ్డి నేడు శాసన సభలో తెలిపారు.

నెర్వి టాల్
నరముల బలహీనతకునూ,
రక్తపోటుకున్నూ రామబాణము
అనుభవయుక్తముగా చేయబడినది.
కి బాక్సుల సీసా రు. 5-75
పోస్టేజి రు. 1-75
ఇండియన్ మెడిసిన్ హౌస్
విజయవాడ-2



నేటి రాత్రి
విజై కుమార్ పిక్చర్స్ వారి:
మహావీర్ భీమసేన్
(సంపూర్ణ మహాభారతము)
(తెలుగు)
రహత్- ముషీరాబాద్
ఆటలు: 6-15 మరియు 9-30.
రీగల్- ఖైరతాబాద్
ఆటలు: 6-30 మరియు 9-30.
—ఈస్టు ఇండియా విడుదల.

నేడే చూడండి

తా: కాంతారావు, జానకి, రాజనాల, జయశ్రీ, ఏ. వి. సుబ్బారావు, శివరావు, బాలకృష్ణ.
కమల్ హైదరాబాద్ రాజేశ్వర్ హైదరాబాద్
ఆటలు: 2-45, 6-15,

రేపు మధ్యాహ్నం 12-15 కు
మహత్తరమైన విడుదల

అచంచలమైన భక్తి ప్రభావం స్వర్గాన్నుంచి భువిని ఉద్ధరించింది.

కన్నుల పండువైన నృత్యములు భక్తి పారవశ్యమైన గాథతోకూడిన మహోజ్వల పౌరాణిక చిత్రం.

శ్రీ వేంకటరామా ఫిలింస్ వారి:

విష్ణుమాయ

దర్శకత్వం: నమ్మాళ్వార్. సంగీతం: మల్లేశ్వరరావు.

తా॥ కృష్ణకుమారి, జయంతి, కాంతారావు, రాజనాల, రఘురామయ్య, మిక్కిలినేని, సత్యనారాయణ.

ప్యాలెస్ అలంకార్ మార్కండేయ
హైదరాబాద్ సికింద్రాబాద్. వరంగల్.

అన్ని థియేటర్లలో శుక్ర, శని, ఆది 4 ఆటలు:
ఉ॥ 12-15, 3-15, 6-15, 9-30,
ఆటల సమయంలో అడ్వాన్సు బుకింగ్.
—ధనలక్ష్మి పిక్చర్స్ విడుదల.

శుభవార్త!
ముఖ్యంగా స్త్రీలకు
రేపే బ్రహ్మాండమైన విడుదల మ్యాట్నీ 2-45 గం॥ లకు

తన భర్త, తన్నుగాదుకుల కోసము ఎన్నోపాట్లుపడి చివరికి ధారవనారి లోకానికే వన్నెతెచ్చి నచ్చిన అమాయక స్త్రీ జీవిత గాథ

చూచి ఆనందించండి

సి. కె. సి. వారి

పతి గౌరవమే సతికానందం

(తెలుగు) లో



తారాగణం :- ఎన్. టి. రామారావు, సమాజారావు, రాజేశ్వరి, వంకరీబాయి, పాహుకారు జానకి, సంధ్య, మరియు ప్రముఖులు. రాధాసూరిని నృత్యాలతో:

ఒకే సారి విడుదల:

సాగర్ (హైదరాబాద్) రహత్ (ముషీరాబాద్) తదుపరి మార్పు ??? (సికింద్రాబాద్)

రోజూ 3 ఆటలు: 2-45, 6-00, 9-30 గం॥
కాంప్లిమెంటరీలు చెల్లనేరవు. —ఉదయశ్రీ విడుదల.

Edited Printed published by N Narotham Reddy M. A
for the Golkonda publications Ltd
at Golkonda printing press Hyderabad A.p.

అమ్మకంపన్ను, మోటార్ స్పిరిట్ సవరణ బిల్లుల ఆమోదం

హైదరాబాద్, జులై 31

కళాశాలలు, పాఠశాలల పుస్తకాలను అమ్మకంపన్ను చెల్లింపు నుండి మినహాయించాలన్న నేషనల్ డెమోక్రాట్స్ నాయకుడు శ్రీ తెన్నేటి విశ్వనాథం సవరణతో పాటు సాధారణ అమ్మకం పన్ను సవరణ బిల్లును నేడు ఉదయం రాష్ట్రశాసనసభ ఆమోదించింది.

మొత్తం పదిసార్లు ప్రతిపక్షాలు ఓటింగు కోరాయి కాని ఒక దశలో ప్రభుత్వానికి 117 ఓట్లు ప్రతిపక్షాలకు 50 ఓట్లు రావడం కూడా తటస్థించింది.

సెలక్టు కమిటి అందచేసిన ఈ బిల్లు 1963 ఆగస్టు మొదటి తేదీనుండి అమల్లోనికి తేవాలన్న అధికార సవరణను గూడా రాష్ట్రశాసనసభ ఆమోదించింది.

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్స్ డైరెక్టర్ జనరల్ డా॥ పి. ఎస్. లోకనాథన్ సిఫారసుల ఆధారంగా ఈ బిల్లు రూపొందింపబడింది. ఆంధ్రప్రదేశ్‌లోని అమ్మకం పన్ను వ్యవస్థను పరిశీలించి మార్పులకై తగు సిఫారసులు చేయుమని రాష్ట్ర ప్రభుత్వం వీరిని నియోగించింది.

ఈ కొత్త బిల్లు వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి అమ్మకంపన్ను ఆదాయంలో దాదాపు రు. 2 కోట్లు సాలీనా పెరుగుతుంది.

ఇంకా శాసనసభ మోటార్ స్పిరిట్ పన్ను సవరణ బిల్లును గూడా ఆమోదించింది. ఈ బిల్లును అనుసరించి డీసెల్ ఆయిల్ పై లీటర్‌కు 5 న. పై. బదులు 7. న. పై. అమ్మకం పన్ను వసూలు చేయబడుతుంది.

పంచాయతీ అధ్యక్షుని తొలగింపు

హైదరాబాద్, జులై 31

తిరువూరు తాలూకా విస్సన్నపేట బ్లాకులోని కొత్తగూడెం పంచాయతీ అధ్యక్ష పదవినుండి శ్రీ సి. హెచ్. వి. సుబ్బారావును తొలగిస్తూ నూజివీడు రెవెన్యూ డివిజనల్ అధికారి ఉత్తరులు జారీచేశారు. ఈ ఉత్తరువు 1-9-68 నుండి అమలులోకి వస్తుంది.

ఎగుమతుల పెంపుదలకు అధునాతన పద్ధతులు

అమెరికా నుంచి 25 లక్షల రూ.ల గ్రాంటు

న్యూఢిల్లీ, జులై 31

భారత దేశపు ఎగుమతులను పెంపొందించడానికిగాను భారత ప్రభుత్వానికి అమెరికా ప్రభుత్వం మొత్తం 25 లక్షల రూ. ల గ్రాంటు యిచ్చింది. ఈ గ్రాంటులో కొంత భాగం డాలర్లుగాను, కొంతభాగం రూపాయిలుగానూ వుంటుంది. ఈ పథకం క్రింద, పారిశ్రామిక వాణిజ్య రంగాల నిపుణులు అయిదుగురూ, స్వల్పకాలం పనిచేసే మరికొంతమంది ప్రవీణులూ ఇంజినీరింగు వస్తు ఎగుమతి ప్రోత్సాహక సమితికి సహాయ పడతారు.

అమెరికా ప్రభుత్వానికి చెందిన అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ యీ నిపుణులను పంపుతోంది: ప్రపంచ మార్కెట్లలో భారతదేశపు ఇంజినీరింగు పారిశ్రామిక సరుకుల అమ్మకాలను పెంపొందించేందుకు వీరు మేలి రకం పద్ధతులు సూచిస్తారు.

ఇటీవలి సంవత్సరాలలో, భారత ఇంజినీరింగు పరిశ్రమ ఎగుమతులు విశేషంగా హెచ్చాయి. అయితే, అధునాతన విక్రయ పద్ధతులను ప్రవేశపెడితే, యీ ఎగుమతులు ఇంకా హెచ్చి భారతదేశానికి యితోధికంగా విదేశ నూరక ద్రవ్యం సమకూర్చగలవని ఆశించబడుతోంది.

1961లో నేరాలు తగ్గుదల

న్యూఢిల్లీ, జులై 31

దేశీయాంగ మంత్రిత్వశాఖ వద్దవున్న లెక్కలను బట్టిచూస్తే ఈ దేశములో 1958 నుంచి 1960 వరకు ప్రభుత్వం గుర్తించిన నేరాలు సరాసరిన లక్షకు 146.3 వున్నట్లు తెలుస్తుంది 1961లో అవిలక్షకు 143మాత్రమే వున్నట్లువాటినిబట్టి గ్రహించవచ్చును.

దొంగనోట్ల తయారీ, దోపిడీలు తగ్గాయి. వరుసగా అవి 6.19 శాతం, 2.85 శాతం వున్నాయి.

రాష్ట్రాలవారీగా పరిశీలిస్తే, ఉత్తర ప్రదేశ్‌లో ఆ మూడు సంవత్సరాల సరాసరికి 53.2 శాతం అధికముగా నేరాలు నమోదు అయినాయి. ప్రభుత్వం గుర్తించదగిన నేరాలన్నిటినీ నమోదు చేయాలని ఆ రాష్ట్రములో తీవ్రంగా ప్రయత్నం జరగటమే యిందుకు ప్రధాన కారణము.

మైసూరు, రాజస్థాన్‌లకు ద్వితీయ స్థానం లభిస్తుంది. వీటిలో ఆ మూడు సంవత్సరాల సరాసరికి మించి వరుసగా 5.9 శాతం, 2.29 శాతం అధికంగా నేరాలు నమోదు అయినాయి. ఆ మూడు సంవత్సరాల సరాసరికి తక్కువగా నేరాలు నమోదు చేసిన రాష్ట్రాలలో మహారాష్ట్రకు అగ్రస్థానం లభిస్తుంది.

పెట్రోలియం ఉత్పత్తుల రవాణాకు గొట్టపు మార్గాలు

ఇటాలియన్ సంస్థతో ఒప్పందంపై సంతకాలు

న్యూఢిల్లీ, జులై 31

భారతదేశపు తూర్పు ప్రాంతంలో పెట్రోలియం ఉత్పత్తుల రవాణాకు రెండు గొట్టపు మార్గాలు నిర్మించేందుకు ఇండియన్ రిఫైనరీస్ లిమిటెడ్ సంస్థకూ - ఇటలీకి చెందిన స్నామ్ వ్యాపార సంస్థకూ మధ్య కుదిరిన ఒప్పందంపై యీ వాళ్ళ యిక్కడ సంతకాలు జరిగాయి.

వీటి నిర్మాణానికి మొత్తం దాదాపు రూ. 11.38 కోట్లు ఖర్చవుతుంది ఇందులో రూ. 7.30 కోట్ల విలువైన విదేశ మారక ద్రవ్యం ఖర్చు ఇటలీకి చెందిన ఇ. ఎన్. ఐ సంస్థ భారత ప్రభుత్వానికి యిచ్చే 10 కోట్ల డాలర్ల ఋణ సహాయం నుంచి భరించబడుతుంది. చమురు గనుల పథకాలకు 10 కోట్ల డాలర్ల ఋణ సహాయం చేయగలమని ఇ, ఎన్. ఐ. సంస్థ 1961 ఆగస్టులో ప్రకటించింది.

మొదటి గొట్టపుమార్గం నిడివి 580 కిలోమీటర్లు, హల్దియానుంచి బరౌనీ శుద్ధికర్మాగారంవరకూ యీ మార్గం వేయబడుతుంది. బరౌనీ శుద్ధికర్మాగారంనుంచి కాన్పూరు వరకూ వేయబడే రెండోగొట్టపుమార్గం నిడివి 680మీటర్లు.

ఇ. ఎన్. ఐ. సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంకింద పరపతి ఒప్పందంకింద సంతకాలు జరిగిన కంట్రాక్టులలోయిది అయిదవది.

జాతీయ సైనిక విద్యార్థి దళ సభ్యుల ప్రతిజ్ఞ

ఆగస్టు 14 న దేశవ్యాప్తంగా ఉత్సవాలు

న్యూఢిల్లీ, జులై 31

ప్రధాన మంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ ఆగస్టు 14 వ తేదీన నిర్బంధ జాతీయ సైనిక విద్యార్థి దళ శిక్షణ పథకానికి ప్రారంభోత్సవం జరుపుతారు. ఈ పథకం లాంఛనముగా ఆ మరునాడు అమలులోకి వస్తుంది.

ఈ సందర్భంగా, దేశంలో సుమారు 2 వేల కేంద్రాలలో పాఠశాలలలోనూ, కళాశాలలలోనూ సుమారు 12 లక్షల మంది జాతీయ సైనిక విద్యార్థి దళ సభ్యులు "ప్రతిజ్ఞ విన్యాసాలు" జరుపుతారు.

ఈ నెల 14 న న్యూఢిల్లీలో జరిగే యీ ఉత్సవాలకు ప్రధాన మంత్రి అధ్యక్షత వహిస్తారు. జాతీయ సైనిక విద్యార్థి దళవివిధశాఖలసభ్యుల విన్యాసములో ఆయన సైనిక వందనం స్వీకరిస్తారు. ఆ తరువాత వారందరిచేత జాతీయ సైనిక విద్యార్థి దళం డైరక్టరు జనరల్. మేజర్ జనరల్ వీరేందర్‌సింగ్ సైనిక విద్యార్థి దళ ప్రతిజ్ఞ చేయిస్తారు.

సైనిక విద్యార్థులందరూ ఏకకంఠముతో చేసే ప్రతిజ్ఞ యిది: "నా దేశానికివిధేయతతోనూ, తికరణశుద్ధిగానూ పనిచేస్తానని, జాతీయ సైనిక విద్యార్థి దళం నియమావళికి కట్టుబడిఉంటానని నా దళవాయి కోరినప్రకారం, అన్ని విన్యాసాలకూ, శిబిరాలకూ శక్తివంచన లేకుండా హాజరవుతానని ప్రతిజ్ఞం చేస్తున్నాను".

ప్రధానమంత్రి ఉపన్యాసంతో ఈ ఉత్సవం సమాప్తమవుతుంది.

రాష్ట్రప్రభుత్వ కార్యాలయాలలో తెలుగులో పత్రవ్యవహారాలు

తాలూకా స్థాయివరకు ప్రవేశపెట్టబడినదని ముఖ్యమంత్రి ప్రకటన

హైదరాబాద్, జులై 31

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నిజిల్లాలలో ఇరువది ప్రభుత్వశాఖలకు సంబంధించి నంతవరకు తాలూకాస్థాయి మరియు అంతకుక్రింది కార్యాలయాలలో తెలుగులో పత్రవ్యవహారాలు అనుమతింపబడినవని నేడు రాష్ట్రశాసనసభలో ముఖ్యమంత్రి ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. ప్రభుత్వపు ఇతర శాఖలలో మరియు తాలూకాపై స్థాయి ప్రభుత్వకార్యాలయాలలో అధికార పత్రవ్యవహారాలకై తెలుగును ప్రవేశపెట్టే విషయమై కాల నిర్ణయం ఏమీ చేయబడలేదని క్రమముగా అన్ని శాఖలలో అన్నిస్థాయిలందు తెలుగును ప్రవేశపెట్టడమే ప్రభుత్వ అభిమతమని ఐయితే పరిపాలనా సామర్థ్యంతగ్గకుండా లేకపభుత్వ కార్యకలాపాల నిర్వహణలో మందకొడితనం ఏర్పడకుండా చూడవలసి ఉన్నదన్నారు ముఖ్యమంత్రి.

(మొదటిపేజీ తరువాయి)

హక్కుల తీర్మానంపై నిర్ణయాన్ని స్పీకరు శ్రీ సుబ్బారెడ్డి నేడు వాయిదా వేశారు. ఈ తీర్మానంపై ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి ప్రజలఇక్కట్లు తెలుపడానికి శాసనసభ్యులువస్తే అధికారులు శ్రద్ధగావిని మర్యాదగా ప్రవర్తించాలని అధికారులకు ఆదేశాలు పంపామనీ ఆఆర్. డి. ఓ ను ట్రాన్స్ ఫరు చేశామనీ చెప్పారు.

కడెం ప్రాజెక్టునుండి 15 వేల ఎకరాలకునీరు

నేడు రాష్ట్రశాసనసభలో ప్రభుత్వ దృష్టి నాకర్షిస్తూ తెచ్చిన ప్రతిపాదనకు జవాబిస్తూ నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి 1968-64 మొదటి పైరుకాలంలోనే కడెం ప్రాజెక్టునుండి 15 వేల ఎకరాలకు నీరు అందజేయబడుతుందని చెప్పారు. జులై 24 నుండి కడెం రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగుతున్నదనీ నాటిమధ్యాహ్నంనుండే కాలువలోకి నీరు వదిలారని 500 క్యూసెక్కుల నీరు వదలబడిందనీ ఆయనవివరించారు.

జేగంపేటలోని ఇండియన్ ఏర్ లైన్స్ వర్క్‌షాపును ఇక్కడినుండి తరలించరాదని ఢిల్లీ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందనీ ఇంకా జవాబు రాలేదనీ శ్రీ తెన్నేటి విశ్వనాథం శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యలు తెచ్చిన ప్రతిపాదనకు జవాబిస్తూ మంత్రి మీరమ్మదలీఖాన్ వెల్లడించారు.

కొండరాళ్లు కూలిపడి 4గురు కార్మికుల మృతి

హైదరాబాదు, జులై 31

విశాఖపట్నంవద్ద ఒక క్వారీలో పని చేస్తున్న నల్గురు కార్మికులు పైనుండి రాళ్ళు విరిగిపడిన ప్రమాదంలో మరణించారు. ఈ ప్రమాదము గత ఆదివారము జరిగిందట.

దక్షిణ విశాఖపట్న ప్రాంతంలోని జమ్మికొండ క్వారీలో ఈ ప్రమాదం జరిగింది.

ఆర్మూరుసమితిఅధ్యక్షులుగా శ్రీమల్లారెడ్డి ఎన్నిక

మా విలేఖరి, ఆర్మూరు, జులై 31

ఆర్మూరు పంచాయతి సమితి అధ్యక్షులుగా శ్రీ ఆలూరు మల్లారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయినారు.

నిన్న పంచాయతి సమితి సమావేశం డిప్యూటీ కలెక్టర్ ఎం.ఏ.రషీద్ ఆధ్వర్యాన జరిగింది.

ఆర్మూరు మున్సిపల్ అధ్యక్షుని పై అవిశ్వాస తీర్మానం ఆగస్టు 10వతేదీన పరిశీలనకు వస్తుందని కూడా తెలుస్తున్నది.

నిజామాబాద్ జిల్లా కళాశాల విద్యార్థుల యూనియన్ ఎన్నికలు జరిగి అధ్యక్షుడుగా శ్రీ పి.టంనాథ్, కార్యదర్శిగా శ్రీ పి. కిషన్ రావు ఎన్నికైనట్లు తెలిసింది.

ఆత్మహత్య

మెదక్ జిల్లా వెల్లూరు గ్రామానికి చెందిన శ్రీ జి. వీరయ్య అనునాతడు తన పైపంచెతో ఉరిపోసుకొని జులై 29న ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తున్నది. ఆతనిని అనుమానముపై పోలీసు అరెస్టుచేసి లాకప్ లోఉంచగా లాకప్ గది పైకప్పునుండి ఉరిపోసుకున్నాడట.

నేపా సరిహద్దు ప్రాంతములో చైనా గస్తీదళాలు

కొన్ని అగ్రగామి ప్రదేశాలలోనికి చొచ్చుకొని వచ్చాయని వార్తలు

షిలాంగ్, జులై 31

నేపా సరిహద్దులలో చైనీస్ సైన్యాలు భారీగా కేంద్రీకరింపబడినాయన్న వార్తలతో పాటు సియాంగ్ సరిహద్దు డివిజన్‌లోని మెచుకా ప్రాంతం, కామెంగ్ డివిజన్‌లోని ఖెంజిమానె ప్రాంతంలో చైనా సాయుధ గస్తీ దళాలు చొచ్చుకొని వచ్చాయని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తున్నది.

ఈ సాయుధ గస్తీ దళాలు చైనా రెగ్యులర్ దళాల పురోగామి బృందాలుగా చెప్పబడుతున్నాయి. సుబాన్‌సిరి డివిజన్‌లోని లాంగ్జు ప్రాంతంలోగూడా ఇట్టి గస్తీదళాలు కాన్పిస్తున్నాయని బహుశః ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకొనే ఉద్దేశంతోనే ఇవి ఇటువైపు వచ్చాయని తలచబడుతున్నది.

చైనా సాయుధదళాలు సరిహద్దుల వెంట గూఢచారిత్వాన్ని సాగిస్తున్నాయి. ముఖ్యముగా సియాంగ్ యొక్కట్యూటిగ్ ప్రాంతములో ఈ మధ్య చైనా గూఢచారిత్వ చర్యలు పెరిగాయి. చైనాపై న్యాయికి తోవలు చూపేందుకు టిబెట్ యువకులు బలవంతముగా లాగబడుతున్నారట.

నదీజలాలసమస్య పునః పరిశీలన?

ప్రధానినెహ్రూ, డా॥ కె.ఎల్.రావులు వాగ్దానం చేసినట్లు మహారాష్ట్రముఖ్యమంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, జులై 31

పరస్పర చర్చలు సుహృద్భావం ద్వారా కృష్ణా గోదావరి నదీజలాల పంపిణీలో మైసూరు, మహారాష్ట్రలకు న్యాయం లభించవచ్చునని మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎం. ఎస్. కన్నంవార్ నేడు ఆశాభావం వ్యక్తపరిచారు.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కన్నంవార్, ఇరిగేషన్ మంత్రి శ్రీ శంకరరావు చ్యవన్‌లు నిన్న ప్రధాని శ్రీ నెహ్రూను కలిసి నదీజలాల విషయం చర్చించారు. నిరుద్వేక వాతావరణంలో తుణ్ణంగా నదీజలాల సమస్యను పునః పరిశీలించి న్యాయమైన పరిష్కారం చేయాల్సిందిగా వారు ప్రధానిని కోరారట. మహారాష్ట్ర ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రులు కేంద్ర ఇరిగేషన్ మంత్రి డా॥ కె. ఎల్. రావునుకూడా కలిసిమాట్లాడారు.

ప్రధాని నెహ్రూ, ఇరిగేషన్ మంత్రి డా॥ రావులు శీఘ్రగా తమ వాదాన్ని విన్నారనీ మహారాష్ట్ర ప్రభుత్వం అందజేసే సరికొత్త సమాచారం ఆధారపరచుకొని సమస్యను తిరిగి పరిశీలిస్తామని వాగ్దానం చేశారనీ శ్రీ కన్నంవార్ అన్నారు. డా॥ రావు త్వరలో బొంబాయి పర్యటనకు రానున్నారు. ఆ సందర్భంగా కూడా ఆయన మహారాష్ట్ర ప్రభుత్వాధికారులతో చర్చిస్తారట.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి నేడు కేంద్ర హోం మంత్రి శ్రీ శాస్త్రిని ప్లానింగు మంత్రి శ్రీ నందనుకూడా కలిసి మాట్లాడారు.

శ్రీ డాంగే మాస్కో చేరిక

ప్రావదాలో మొదటి పుటలో ప్రధానముగా ప్రచురణ

మాస్కో, జులై 31

భారత కమ్యూనిస్టుపార్టీ అధ్యక్షుడు శ్రీ ఎస్. ఏ. డాంగే నిన్న మాస్కో చేరినవార్త ప్రావదా పత్రికలో మొదటి పుటలో ప్రధానముగా ప్రచురించబడింది.

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ శ్రీ డాంగేను ఆహ్వానించింది.

రాయదుర్గం మునిసిపాలిటీ పర్వాటు

హైదరాబాద్, జులై 31

అనంతపురం జిల్లా రాయదుర్గం పంచాయతీ పరిధిలో వున్న స్థానిక ప్రాంతంలో 1963 అక్టోబరు నుండి మునిసిపాలిటీని పర్వాటుచేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మునిసిపాలిటీలో 20మంది కౌన్సిలరు ఉంటారు

అంతాప్రధానినెహ్రూను బలపరచాలి

రాష్ట్రపతి సలహా

హైదరాబాద్, జులై 31

నేటి ఆందోళన పరిస్థితిలో జాతిని వాదాల వదలి వేసి బాధ్యతతో జాతితో పనిచేయాలని రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ కొందరు ఎం.ఎల్.ఎ.ల ప్రతినిధివర్గానికి సలహా ఇచ్చారు.

స్వతంత్రపార్టీ ఎం.ఎల్.ఎలు రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ మకలసిరాజ్యాంగపు 17వ సవరణను గూర్చి ఒక మెమొరాండాన్ని అందచేశారు.

ఈ మెమొరాండన్ని స్వీకరిస్తూ రాష్ట్రపతి ప్రజలకు సేవచేయడంలో ప్రభుత్వానికి ప్రధానినెహ్రూకు మద్దతుఇవ్వాలని ఈ ప్రతినిధివర్గానికి సలహా ఇచ్చారు.

విద్యావిషయక ప్రకటన

వి. వి. ఎక్స్‌ల్సర్ ఉన్నత పాఠశాల యొక్క పాయత్రిపు తరగతులు వి. వి. కన్యాశాల భవనం నుండి మోజంజాహి మార్కెట్ సమీపమునగల ఎక్స్‌ల్సర్ ఉన్నత పాఠశాల భవనమునకు మార్చబడినది.

రుసుంరేట్లు తగ్గించబడినవి.

A. A.

రేపు మ॥ 12-30 కు బ్రహ్మాండమైన విడుదల

వయోజనులకు నమ్మోహనకర చిత్రం
హృదయగతమైన ఉత్తమ ప్రేమను రూపించే గాథ

ఉత్తమ చిత్రా వారి

బిన్ బాదల్ బర్సాత్

తారాగణం: ఆశాపరేఖ్, బిశ్వజిత్, నిషి, దేవకిషన్, మహమూద్.

దర్శకత్వం: జ్యోతిస్వరూప్. సంగీతం: హేమంత్‌కుమార్. పాటలు: షకీల్.

ఒకేసారి విడుదల:

జమ్‌ఖిద్ మహల్ (పూర్తి ఏర్ కండిషన్డు థియేటర్) హైదరాబాద్
మనోహర్ సికింద్రాబాద్

శుక్ర, శని, ఆదివారములు 4 ఆటలు: 12-30, 3-30, 6-30, 9-30.

జమ్‌ఖిద్‌లో ఉ॥ 10-30 నుండి 12-30 మరియు ఆటల సమయములలో అడ్వాన్సు బుకింగ్.
—శ్రీ సినీ కార్పొరేషన్ విడుదల.